RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 169 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం,డిసెంబర్,26,2025 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 169 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday,December,26,2025 | PAGES : 8 RS : 4 /-



## గాజా వాసులను వెంటాడుతున్న మృత్యువు

**వైద్య సరఫరాలను అడ్డుకుంటున్న ఇజ్రాయిల్**

గాజా: ఇప్పటికే అనేక కష్టాలను ఎదుర్కొంటున్న గాజావాసులను కొత్త ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. వైద్య సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్న గాజా వాసుల విషయంలో ఇజ్రాయిల్ మరింత అమానుషంగా వ్యవహరిస్తోంది. వారిని మృత్యుముఖంలోకి నెడుతోంది. గాజాలో ఆరోగ్య వ్యవస్థ ఇప్పటికే కుదేలయింది. తాజాగా ఇజ్రాయిల్ చర్యలతో ఏ క్షణాన అయినా కుప్పకూలిపోయే ప్రమాదం తలెత్తింది. గాజాలోకి వైద్య పరికరాలు, మందులు ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటుండడంతో వేలాది మంది రోగులను మృత్యువు వెంటాడుతోంది. గాజాలోని ఆస్పత్రులలో పరిస్థితి దారుణంగా, భయానకంగా ఉన్నదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్-బర్ష్ తెలిపారు.



## నైజీరియాలో.. మృత్యుఘోష

**మసీదులో బాంబు పేలుడు.. ప్రార్థనల్లో ఉన్న 10 మంది మృతి!**

నైజీరియా: పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. బోర్నో రాష్ట్ర రాజధాని మైదుగురిలోని ఒక మసీదులో బుధవారం సాయంత్రం ప్రార్థనల సమయంలో భీకర బాంబు పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో కనీసం 10 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గంబోరు మార్కెట్ ప్రాంతంలోని రద్దీగా ఉండే మసీదులో ఈ పేలుడు సంభవించడంతో ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. సాయంత్రం వేళ ముస్లింలు పెద్ద సంఖ్యలో మసీదుకు చేరుకుని ప్రార్థనల్లో నిమగ్నమై ఉండగా ఈ పేలుడు జరిగింది. మసీదు లోపల ముందే అమర్చిన బాంబు పేలి ఉండవచ్చని లేదా ఆత్మాహుతి దాడి జరిగి ఉండవచ్చని స్థానిక మిలీషియా నాయకులు అనుమానిస్తున్నారు.



## కర్నాటకలో ఘోర బస్సు ప్రమాదం

- టూరిస్ట్ బస్సును ఢీకొన్న కంటెయినర్ లారీ
- మంటలు చెలరేగడంతో 17మంది సజీవదహనం
- క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స
- రాష్ట్రపతి, ప్రధాని మోడీ సంతాపం



బెంగళూరు, డిసెంబర్25 : కర్నాటకలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ ఢీ కొట్టడంతో బస్సులలో మంటలు చెలరేగి 17 మంది సజీవ దహనమయ్యారు. మరో మరో 13 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన చిత్రదుర్గ జిల్లా జవరగుండనహళ్లి శివారులో తెల్లవారు 3 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి గోకర్ణం వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ సహా 17 మంది మృత్యువాత పడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 29 మంది ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తున్న సీబర్డ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటెయినర్ లారీ ఢీకొట్టింది. లారీ.. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 17 మంది ప్రయాణికులు సజీవ దహనమ య్యారు. చిత్రదుర్గ జిల్లాలోని జాతీయ రహదారి-48పై గోర్లత్తు క్రాస్ వద్ద గురువారం వేకువజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచే సుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. చిత్రదుర్గ, తుమకూరు జిల్లాల పరిధిలోని అధికార యం త్రాంగం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి అతివేగం, పొగమం చు కారణమని భావిస్తున్నారు. బస్సుతో పాటు కంటెయినర్ లారీకి కూడా మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్, కో డ్రైవర్ అందులోంచి దూకి తప్పించుకున్నారు.




## పరిపాలనా దక్షత.. ఉన్నత విలువలు

**అవే వాజ్‌పేయ్ ఉన్నత భావాలున్న నేత**

**101 జయంతి సందర్భంగా కిషన్ రెడ్డి నివాళి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి మంచి వక్త, మంచి పరిపాలనా దక్షుడు, విలువలు కలిగిన మహా నేత అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు.అటల్ జీ 101వ జన్మదినం సందర్భంగా దేశమంతా ఉత్సవాలు కార్యక్రమాలు జరుపుకుంటున్నామని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని , భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కేంద్రమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు . అనంతరం మాట్లాడుతూ.. ఒక్క ఓటు తేడా ఉంటే నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసి ప్రధాని పదవిని తృణ ప్రాయంగా వదులుకున్న మహోన్నతమైన నేత అటల్ జీ అని అన్నారు. భారతదేశ రక్షణ కోసం ఎంతో కృషి చేసి సుపరిపాలన అందించిన నేత అని తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ పేరుతో విద్యాలయాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశారని చెప్పారు.. పేద ప్రజల పక్షాన నిలిచి వారి అభ్యుదయం కోసం అనేక సంస్కరణలు తీసుకోచ్చిన నేత అటల్ అని అన్నారు. ఆయన ప్రసంగాలు, వ్యక్తిత్వం దేశ యువతకు మార్గదర్శిగా నిలిచాయన్నారు. పాకిస్థాన్ వెన్నుపోటు పొడిస్తే తిరిగి పాక్‌కు మూడు చెరువుల నీళ్ళు తాగించి పాక్‌ను మట్టికరిపించిన ఘనత అటల్‌కు దక్కుతుందని చెప్పుకొచ్చారు. ఒక దేశం నుండి మరొక దేశానికి.. ఢిల్లీ నుంచి లాహోర్‌కు బస్‌లో వెళ్లిన మొదటి ప్రధాని మోదీ అని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి పేరుతో దేశ వ్యాప్తంగా రోడ్ల విస్తరణ చేసిన ఘనత ఆయనది అని అన్నారు. దేశ ప్రగతిలో తనదైన ముద్ర వేసుకున్న మహానుభావుడన్నారు. దేశ యువతకు అటల్ జీ జీవితం ఒక స్ఫూర్తి అనితెలిపారు. నేడు వాజ్‌పేయికు యావత్ దేశం ఘనంగా నివాళి అర్పిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



## ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

**- భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి**

కందమాల్: ఒడిశాలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. కందమాల్ జిల్లాలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఘటనాస్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.కందమాల్ జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నట్టు భద్రతా బలగాలకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు, ప్రత్యేక బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరే షన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఓ చోట మావోయిస్టులు తారసపడటం తో లొంగిపోవాలని బలగాలు హెచ్చరించాయి. అయితే, మావోయి స్టులు కాల్పులకు తెగబడటంతో భద్రతా దళాలు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపాయి.



## రెచ్చిపోతున్న గంజాయి మాఫియా

**- మౌనంగా ఉన్న పోలీస్ యంత్రాంగం?**

**మహబూబాబాద్, తెలంగాణ దిశ :** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగు తుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పోలీస్ శాఖ నిఘా ఉన్నప్పటికీ గంజాయి మాఫియా మాత్రం ఎలాంటి భయం లేకుం డా బహిరంగంగా తన వ్యాపారా న్ని సాగిస్తున్నట్లు పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి సరఫరా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ పరిసరాలు, పాఠశాలలు - కాలేజీలకు సమీప ప్రాంతాలు,

## వేలకోట్లు సంపాదనలో ఓ ఇద్దరు మంత్రులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. వారిపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందన్నారు. ఎప్పటికైనా ఆ ఇద్దరు రాష్ట్రమంత్రులు జైలుకెళ్లడం ఖాయమని సంచలన కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం వద్ద అధారాలు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది మంత్రులు వేల కోట్ల భూములను అమ్ముకుంటున్నారని.. దీన్ని ఎప్పటికైనా బయటపెడతామని హెచ్చరించారు. ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులు జైలుకెళ్లడం ఖాయమని ఆయన చెప్పారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేసీఆర్ మీద రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష సరైంది కాదన్నారు. ఇకపోతే ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు మాట్లాడే ముందు జాగ్రతగా ఉండాలని.. అంతేకానీ ఇలా దిగజారి మాట్లాడితే ఆ పదవికి ఉన్న గౌరవం తగ్గుతుందని బండి సంజయ్ హితవు పలికారు. మాజీ సీఎంపై రేవంత్ రెడ్డి వాడిన భాషమీదే తెలంగాణలో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోందన్నారు. నీటి వాటాల అంశంలో తప్పు చేసిందే కేసీఆర్ అని అన్నారు.



- ఆ ఇద్దరూ అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లక తప్పదు
- కొంతమంత్రి మంత్రులు భూ దందాలతో సంపాదన
- దీనిని తామే ఎప్పటికైనా బయటపెడతాం
- సీఎంగా రేవంత్ భాష పద్దతిగా లేదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

# రోడ్డెక్కితే.. చుక్కలే!



**- సిటీలో అడుగడుగునా ట్రాఫిక్ జామ్ - జంక్షన్లు, ప్లై ఓవర్ల వద్ద ఆగిపోతున్న వాహనాలు**
**- జాడలేని ట్రాఫిక్ సిబ్బంది 3977 వాహనాలకు ఒకే పోలీస్ - రెండేండ్లలో అధ్వానంగా ట్రాఫిక్ నిర్వహణ - సిటీలో 90 లక్షల వాహనాలు - రోజుకు 1,500 నుంచి 2 వేల కొత్త వాహనాలు రిజిస్టర్**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**అత్యవసరమని కారు లేదా బైక్‌తో రోడ్డెక్కితే చాలు.. ట్రాఫిక్‌లో చిక్కుకోవడమే.. ఒక్కసారి ట్రాఫిక్‌లో ఇరుక్కున్నామంటే గంటల తరబడి నరకయాతన అనుభవిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాఫిక్ జామ్‌లతో నగరవాసులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. కీలక సమయాల్లో రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు కనిపించరు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మహానగరంలో ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారింది. ఆఫీసుకు, అత్యవసర పనికి, స్కూల్, కాలేజీకి.. ఇలా ఏ అవసరం వచ్చి బయటకు వెళ్లాలన్నా..గంటల తరబడి రోడ్ల మీద గడపాల్సి వస్తున్నది. రెండేండ్లలో నగరంలో ట్రాఫిక్ నిర్వహణ మరీ అధ్వానంగా మారింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి.. దేశంలో అత్యంత రద్దీ కలిగిన ఆరో నగరంగా అవతరించింది. ఈ ఏడాది సిటీలో వాహనాల సంఖ్య సుమారు 90 లక్షలకు చేరుకోవడంతో దేశంలో అత్యధిక వాహన డెన్సిటీ కలిగిన నగరంగా నిలిచింది. ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు పోలీసులు నిరంతరం కసరత్తు చేస్తున్నారు. ఆరేండ్లలో నగర రోడ్లపై వాహనాల సంఖ్య 40 శాతం పెరిగింది. 2019లో కిలోమీటర్‌కు 6500 వాహనాలుండగా, 2025లో కిలోమీటర్‌కు దాదాపు 9500 వాహనాల రాకపోకల డెన్సిటీ ఉంది. రోజుకు 1500 నుంచి 2 వేల కొత్తవాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి. సిటీలోని మొత్తం వాహనాల్లో 63 లక్షల ద్విచక్రవాహనాలు, 16 లక్షల కార్లు రోడ్ల మీద తిరుగుతున్నాయి. కిలోమీటర్‌కు 2వేల కార్లు రోడ్డు మీదే ఉంటున్నాయి.

కనిపించని ట్రాఫిక్ సిబ్బంది..: రెండేండ్లుగా ట్రాఫిక్ నిర్వహణ పూర్తిగా అధ్వానంగా మారింది. గతంలో ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయితే వెంటనే సిబ్బందితో సహా అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ ట్రాఫిక్ సమస్య తొలగించేవారు. కానీ ఈ మధ్యకాలంలో ప్రధాన సెంటర్లలో తప్ప అసలు సిబ్బందే ఉండకపోగా.. అధికారులు కనిపించడమే మానేశారు. కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో తప్ప..ట్రాఫిక్ జామ్‌ల సమయంలో అధికారులే ఉండడం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ సెల్‌ఫోన్లతో ఫొటోలు తీయడం, రోడ్డుకు పక్కకు వెళ్లి నిల్చొని ముచ్చట్లు పెట్టడం తప్ప సీరియస్‌గా డ్యూటీ చేయడం లేదు. దీంతో ఫ్రీలెఫ్ట్ ఉన్న దగ్గర, సిగ్నల్ క్రాసింగ్ నివారించలేకపోతున్నారని వాహనదారులు అంటున్నారు. గత ప్రభుత్వంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ అధికారులు సమీక్షలు జరిపేవారు.

## కడుపులో బ్లేడు వదిలేసిన వైనం



**నరసరావుపేట,తెలంగాణ దిశ :**ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో వైద్యుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచే అత్యంత దారుణమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఓ మహిళ తీవ్రమైన కడుపునొప్పి కారణంగా స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఆ మహిళకు అక్కడి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ క్రమంలో అత్యంత ప్రమాదకరమైన వస్తువును రోగి కడుపులోపలే వదిలేసినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ తర్వాత కూడా మహిళకు కడుపునొప్పి తగ్గకపోగా, అది రోజురోజుకూ మరింత తీవ్రంగా మారిందని. నొప్పి భరించలేక మహిళ కుటుంబసభ్యులు ఆమెను వేరే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ జరిపిన సమగ్ర స్కానింగ్ పరీక్షల్లో అసలు విషయం బయటపడింది. ఆపరేషన్ చేసిన చోట ఒక బ్లేడు ముక్కను వైద్యులు కడుపులోపలే వదిలేసినట్లుగా వైద్య పరీక్షల్లో వెల్లడైందని. దాని వల్లే మహిళకు కడుపు నొప్పి తీవ్రమైనట్లు వైద్యులు గుర్తించారు. ఈ విషయం తెలియగానే రోగి కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులే ఇంత ఘోరమైన నిర్లక్ష్యానికి పాల్పడటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారుణ ఘటన నేపథ్యంలో మహిళ కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులైన డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, అలాగే బాధిత మహిళకు తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఘటనపై అధికారుల స్పందన కోసం కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు. వైద్యుల తీరుపై ప్రజలు, సంఘాలు పెద్ద ఎత్తున విమర్శలను గుప్పిస్తున్నారు.




# ‘సమున్నత’ విద్య!

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ప్రతిపాదించిన అభ్యాస ఫలితాల ఆధారిత పాఠ్య ప్రణాళిక ముసాయిదా (ఎల్ఒసిఎఫ్) విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిలోకి చొరబడటమే తప్ప వేరేమీ కాదు. ప్రముఖ విద్యావేత్త, చరిత్రకారిణి రొమిలా థాపర్ వ్యాఖ్యానించినట్టు ఎల్ఒసిఎఫ్ విద్య నాణ్యతను పలుచన చేయడాన్ని సూచిస్తుంది. ఈ ముసాయిదా, ఉన్నత విద్యలో విద్యార్థులను ప్రశ్నలు %-% జవాబుల ఫార్మాట్లకే పరిమితం చేస్తుందని, విద్యార్థుల్లో క్లిష్టమైన ప్రశ్నలను లేవనెత్తడాన్ని ప్రోత్సహించడానికి బదులుగా బట్టీపట్టే విధానంగా మార్చే ప్రమాదం ఉందని ఆమె చేసిన హెచ్చరికను ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలి. ఏం బోధించాలి.. ఏం పరిశోధించాలి అనే నిర్ణయాలు ఆయా యూనివర్సిటీలదే తప్ప ప్రభుత్వమో లేదా మరేదైనా సంస్థ పైనుండి పెత్తనం చేస్తామనడం తగదు. ప్రతి విభాగంలోనూ ఏం బోధించాలి, ఎలా బోధించాలి అనేది ఆయా యూనివర్సిటీ సిలబస్, కరిక్యులమ్ వంటివాటిపై ఆధారపడి ఉంటుంది తప్ప ప్రభుత్వం నిర్దేశించకూడదు. అవి విద్యా రంగ నిపుణులు, అత్యాధునిక జ్ఞానం కలిగిన వారికి సంబంధించినవే కానీ పాలనా వ్యవహారాల్లో తలమునకలైవుండే రాజకీయ నేతలకు కాదు. అకడమీషియన్లు చేయాల్సిన పనులు బ్యూరోక్రాట్లు లేదా పొలిటీషియన్లు చేయాలనుకోవడం మూర?త్వమే అవుతుంది. ఇలాంటి సందర్భాల్లో ఎవరికైనా చిన్నప్పుడు చదువుకున్న ‘కుక్క-గాడిద’ కథ గుర్తుకొస్తుంది.

యుజిసి ముసాయిదా పత్రంలో, ‘ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్’పై స్పష్టత లేకపోవడం, విద్యాపరమైన భాగం లేకపోవడం అభ్యంతరకరమైన విషయం. ఈ భావన ఏమిటో వివరించేందుకు సరైన నిర్వచనం లేదా విశ్లేషణాత్మక ఫ్రేమ్‌వర్క్ కూడా లేదని విద్యావేత్తలు చెబుతున్నారు. పైపెచ్చు ‘ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్’ను హిందూ సహకార అంశం అన్న భావనను యుజిసి ముందుకు తేవడం దారుణం. ఇటువంటి అంశాలపై విధానపరమైన ముసాయిదాలను విశ్వవిద్యాలయాలకు పంపేటపుడు విద్యావిషయక ప్రాధాన్యతే కీలకమైనదిగా ఉండాలి. అలా కాకుండా ఒక భావజాలాన్ని బలవంతంగా రుద్దేందుకు యత్నించడం అధికార దుర్వినియోగమే అవుతుంది. సింధు లోయ నాగరికత సహా భారత దేశ చరిత్ర, రెండు శతాబ్దాలపాటు వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన మహోద్యమం గురించిన అంశాలు ఎన్నో వున్నాయి. చరిత్ర, సంస్కృతి మాత్రమేగాక యావత్ విద్యావిషయక అంశాలపై శాస్త్రీయత ప్రాతిపదికగా పరిశోధనలు, విశ్లేషణలూ జరగాలి. అందుకు విశ్వవిద్యాలయాలు అత్యున్నత స్థాయి వేదికలు కావాలి. అక్కడ విశ్వవ్యాపితమైన లౌకిక భావనలు పరిఢవిల్లాలి తప్ప అవి సంకుచితత్వంతో కునారిల్లరాదు.

ఉన్నత విద్యా రంగంలో భారత్ ఎన్నో మైలురాళ్లను దాటింది. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే అభివృద్ధి చేసిన ఐఐటిలు ప్రపంచ ఖ్యాతిని ఆర్జించాయి. వైద్య పరిశోధనలో ఎయిమ్స్ ప్రముఖమైన సంస్థ. నాటి ఆర్యభట్టు నుండి ఈనాటి ఇస్రో వరకు భారత ఖ్యాతి దిగంతాలు వ్యాపించినదే! వివిధ రాష్ట్రాలలోని అనేక విశ్వవిద్యా లయాలు పేరెన్నికగన్నాయి. విద్యా నైపుణ్యాలను వృద్ధిగావించడమే పరమావధిగా నడుస్తున్న ఉన్నత విద్యా రంగంలో జోక్యం చేసుకోవడానికి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వగవర్నర్ల ద్వారా సకల ప్రయత్నాలూ చేస్తోంది. వివిధ రాష్ట్ర విశ్వవి ద్యాలయాల ఛాన్సెలర్ల హోదాలో గవర్నర్లు అటువంటి కుట్రలకు పాల్పడడం జగమెరిగిన సత్యం. ఉన్నత విద్యారంగాన్ని మతతత్వ పూరితం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాల్లో భాగంగానే యుజిసి తాజాగా ఎల్ఒసిఎఫ్ ముసాయిదాను రాష్ట్రాలకు పంపింది. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిలోకి చొరబడే ప్రయత్నాలను విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, ఈ రంగంలోని వారంతా ఒక్కటై తిప్పికొట్టాలి. విశ్వవిద్యాలయాలను, ఉన్నత విద్యను సమున్నతంగా నిలపడమే లక్ష్యంగా ఈ ప్రక్రియ సాగాలి.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ మగువలకు బంగారం ధరలు మళ్లీ షాకిచ్చాయి. నిన్న స్వల్పంగా తగ్గిన ధరలు.. శుక్రవారంమళ్లీ పెరిగిపోయాయి. రోజుకోలాగా బంగారం ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నాయి. శుక్రవారం తులం గోల్డ్‌పై రూ.270 పెరగగా.. సిల్వర్ ధర మాత్రం దిగొచ్చింది. ఏకంగా రూ.4,000 తగ్గింది. బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.270 పెరిగి రూ.1,29, 930 దగ్గర ట్రేడ్ అవుతుండగా.. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.250 పెరిగి రూ.1,19,100 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.210 పెరిగి రూ.97, 450 దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధర మాత్రం ఈరోజు భారీ ఉపశమనం కలిగింది. ఈరోజు బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై రూ.4,000 తగ్గి రూ.1,87, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది. చెన్నై, హైదరాబాద్‌లో మాత్రం రూ.1,96,000 దగ్గర అమ్ముడవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి రూ.1,87,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# గంజాయి బదులు ట్యాబ్లెట్స్

**కొత్త పుంతలు తొక్కుతున్న డ్రగ్ మాఫియా**
**అనుమతి లేకుండా విక్రయిస్తున్న రెండు దుకాణాల లైసెన్స్ సస్పెన్షన్**



**గుంటూరు,తెలంగాణ దిశ :** గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండడంతో గంజాయికి బదులు ట్యాబ్లెట్స్‌కు వ్యసనపరులు అలవాటుపడుతు న్నారు. టాపెంటాడోల్ అనే ట్యాబ్‌లెట్స్ గోవా నుంచి గుంటూరుకు దిగుమతి అవుతున్నాయి. ఈ టాబ్లెట్స్ అక్రమ వినియోగంపై జిల్లా పోలీసు అధికారులు ఔషధ నియంత్రణ శాఖ దృష్టికి తీసుకువెళ్ళారు. వైద్యుల పిస్క్రిప్షన్ లేకుండా ఈ టాబ్లెట్లు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో నగరంలోని పలు అనుమానిత దుకాణాలపై దాడులు చేశారు. రెండు దుకాణాలను గుర్తించి వాటి లైసెన్సును ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ ట్యాబెట్లు ఒక షీటు రూ.మూడు వేలుగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ట్యాబ్లెట్లను నీటిలో కరిగించుకొని సిరంజీ ద్వారా శరీరంలోకి ఎక్కించుకుంటారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఈ తరహా ట్యాబెట్లు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈ అంశాన్ని రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌కు కూడా లేఖ రాయనున్నట్టు తెలిపారు. గుంటూరు జిల్లాలో గత 75 రోజుల్లో గంజాయి, ఎండిఎం మత్తు పదార్థాలను వినియోగిస్తున్న, విక్రయిస్తున్న, సరఫరాదారులను 150 మంది వరకు అరెస్టు చేశామని, ఇంకా 25 మందిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వ్యసనపరులు ప్రత్యామ్నాయంగా మత్తు ట్యాబ్‌లెట్లు వినియోగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇతర దేశాల్లో ఈ ట్యాబెట్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. కానీ మన దేశంలో ఈ ట్యాబ్లెట్లు డాక్టర్ల అనుమతి లేకుండా వినియోగించరాదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ట్యాబ్లెట్లు వినియోగించడం వల్లే శరీరం లో విపరీత పరిణామాలు దారితీస్తాయని, మనిషి మత్తులో ఏం చేస్తాడో తెలియని పరిస్థితులు ఏర్పడతాయి. విచక్షణ కోల్పోవడం, ఎదుట వారిపై దాడులకు పాల్పడటం, అధికంగా వినియోగిస్తే ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు.

## అమెరికా నుంచి 3,258 మంది

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ  మంది భారతీయులను అమెరికా (యూఎస్) బహిష్కరించినట్లు కేంద్రం పార్లమెంట్ లో వెల్లడించింది. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. 2009 నుంచి ఇప్పటి వరకూ 18,822 మంది భారతీయుల్ని అమెరికా బహిష్కరించిందన్నారు. 2023లో 617 మందిని, 2024లో 1,368 మందిని, 2025లో 3,258 మంది భారతీయులను అమెరికా బహిష్కరించినట్లు వివరించారు. ‘జనవరి 2025 నుంచి ఇప్పటి వరకూ 3,258 మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపింది. వీరిలో 2,032 మంది అంటే సుమారు 62.3 శాతం మందిని సాధారణ వాణిజ్య విమానాల ద్వారా స్వదేశానికి పంపింది. మిగిలిన 1,226 మందిని (37.6 శాతం) యుఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించే చార్టర్ విమానాల్లో భారత్‌కు తరలించిందని జైశంకర్ వెల్లడించారుగత ఐదేండ్లలో విదేశీ ఇమ్మిగ్రేషన్ అధికారులు 62 మంది భారతీయ విద్యార్థులకు అమెరికాకు వెళ్లకుండా నిరాకరించారని కేంద్రం తెలిపింది. ఈ మేరకు రాజ్యసభలో ఒక ఎంపీ ప్రశ్నకు విదేశాంగ సహా మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. అలాగే 11 మంది విద్యార్థులను కిర్గిజ్‌స్తాన్‌కు వెళ్లకుండా నిరాకరించారు. అయితే గత ఐదేండ్లలో యూకే 170 మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45 మంది, ఉక్రెయిన్ 13 మంది, ఫిన్‌లాండ్ ఐదుగురు ఇండియా విద్యార్థులను బహిష్కరించాయి.

# బయటకొచ్చి మరో ఐ బొమ్మ పెడతా: రవి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**సినీ పైరసీ వెబ్‌సైట్ ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు విచారించిన విషయం తెలిసిందే.. కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. రవి నుంచి కీలక సమాచారం సేకరించారు. ఐ బొమ్మ సినీ పైరసీని రవి ఒక్కడే చేశాడని నిర్ధారించుకున్న పోలీసులు..పైరసీ ద్వారా సంపాదించిన మొత్తంలో 30 కోట్లకు సంబంధించిన బ్యాంకు లావాదేవీ వివరాలను సేకరించారు. అంతేకాకుండా.. పైరసీ కేసు దర్యాప్తులో పోలీసులు మరింత లోతుగా వెళ్తున్నారు.. ఇంత పెద్ద వలయాన్ని నిర్వహించిన రవిపై పోలీసులు ఇప్పటివరకు రెండు విడతల్లో ఎనిమిది రోజులపాటు కస్టడీ తీసుకుని విచారణ జరిపిన విషయం తెలిసిందే. అయితే ఆ విచారణలో బయటకు వచ్చిన కొన్ని కీలక సమాచారాలతో కేసు కొత్త మలుపు తిరిగింది. అందుకే తాజాగా పోలీసులు మరోసారి నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. మొత్తం మూడు వేర్వేరు కేసుల్లో పీటీ వారెంట్ మీద ఇప్పటికే రవిని కోర్టు ఎదుట హాజరుపరచిన సైబర్ క్రైమ్ అధికారులు.. ఇప్పుడు ఈ మూడు కేసులన్నింటికీ ఐదు రోజులపాటు కస్టడీ ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసుల్లో ఉన్న డిజిటల్ సాక్ష్యాలు, లావాదేవీల రూట్లు, రవి ఇచ్చిన సమాధానాల్లోని లూప్‌హోల్స్ దృష్ట్యా మరింత లోతైన దర్యాప్తు అవసరమని పోలీసులు కోర్టులో వాదించనున్నట్టు తెలిసింది. రవిపై ఇప్పటికే రెండుసార్లు విచారణ జరిగినప్పటికీ, అతను చెప్పిన కొన్ని విషయాలు తాజాగా బయటపడిన వివరాలతో అసలు సరిపోవడం లేదని అధికారులు భావిస్తున్నారు. పైరసీ నెట్‌వర్క్‌ను ఏ విధంగా నడిపాడు? ఎంతమంది మధ్యవర్తుల ద్వారా డబ్బులు చలామణి అయ్యాయి? వేరే దేశాల్లో ఉన్న సర్వర్లతో సంబంధం ఉందా? ఈ విషయాలన్నింటికి పూర్తి క్లారిటీ రావాలంటే మరోసారి కస్టడీ తప్పదని పోలీసులు అంటున్నారు. సైబర్ క్రైమ్ అధికారులు విచారణలో ఒక ఇన్‌ట్రెస్టింగ్ ప్రశ్న వేసినట్టు సమాచారం.. “సైబర్ క్రైమ్ విభాగంలో మంచి శాలరీతో ఉద్యోగం చేస్తావా?” అని పోలీసులు రవిని అడిగారు.. దీనికి రవి ఒప్పుకోలేదు. అతను జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కరేబీయన్ దీవుల్లో రెస్టారెంట్ పెట్టాలని ప్లాన్ చేస్తున్నట్టు చెప్పినట్లు తెలుస్తోంది.. ఇకపై నేరాలకు, పైరసీకి దూరంగా




సక్రమ మార్గంలో జీవించాలని అనుకుంటున్నట్టు తెలిపాడని పేర్కొంటున్నారు.. రెస్టారెంట్ కు ఏం పేరు పెడతావని.. ప్రశ్నించగా.. ఐబొమ్మ పేరు పెడతానని సమాధానం ఇచ్చినట్లు పేర్కొంటున్నారు. “తప్పు చేశానని ఒప్పుకున్నాను.. ఇకపై ఎన్నడూ పైరసీ చేయను” అని రవి కొంత సాఫ్ట్ మోడ్‌లో సమాధానమిచ్చినట్టు సమాచారం..రవిని వివిధ కోణాల్లో పరీక్షించేందుకు మూడోసారి కస్టడీ అవసరం అని పోలీసులు భావించారు పైరసీ నెట్‌వర్క్‌లో ఇంకా బయటకు రాని వ్యక్తులు ఉన్నారు. రవి ఇచ్చిన డేటాను క్రాస్ చెక్ చేయడానికి మరోసారి అతని విచారణ అవసరమని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా అనుమానాస్పద ట్రాన్సాక్షన్లు, అంతర్జాతీయ లింకులు, ఎఖఔ నెట్‌వర్క్‌లో సాగిన కమ్యూనికేషన్ .. ఇవన్నీ రవిని ఎదిరించి అడగాల్సిన ప్రశ్నలే అని తెలుస్తోంది.మరోవైపు రవి తరఫు న్యాయవాదులు పూర్తిగా వేరే కోణంలో వాదిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు విచారణ జరిగిందని, అప్పటికే పోలీసులు తమకు కావలసిన సమాచారాన్ని తీసుకున్నారని, ఇక మళ్లీ కస్టడీ అవసరం లేదని వాదిస్తున్నారు. రవికి నిర్దోషిత్వ అవకాశాలు ఉన్నాయని, మరింతగా కస్టడీ ఇవ్వడం చట్టవిరుద్ధమని వాదన సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రవి బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు కాసేపట్లో తీర్పు చెప్పబోతోంది. బెయిల్ రాకపోతే పోలీసులు కోరిన మూడో విడత కస్టడీకి మార్గం సుగమం అవుతుంది. బెయిల్ మంజూరు అయితే పరిస్థితి పూర్తిగా మారిపోతుందని పేర్కొంటున్నారు.

## సంపాదకీయం

### రూపాయి పతనం.. పర్యవసానాలు..!

మన రూపాయి విలువ ఎన్నడూ లేనంతగా నేడు పతనమైంది. ఒక డాలర్‌కు 90 రూపాయలు చెల్లించాల్సిన స్థితికి విలువను కోల్పోయింది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్‌తో రూపాయి విలువ రూ.62.33 ఉండగా.. ఈ గురువారానికి రూ.90.37 పైసలకు పతనమైంది. ఒకవైపు దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరిగి, ప్రపంచ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం దూసుకుపోతుందని కేంద్ర పాలకులు, వారి అనుచరగణం గగ్గోలు పెడుతుంటే, రూపాయి విలువ మాత్రం వేగంగా దిగజారిపోతున్నది. రూపాయి విలువ పతనంపై ఆర్థిక నిపుణులు, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన ఎగుమతుల కంటే దిగుమతులు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ డిమాండ్ పెరగడంతో పాటు, మన దేశం నుండి మదుపుదారులు చైనాకు తమ డబ్బును తరలిస్తుండడం, దేశ ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోవడం, మోడీ ప్రభుత్వం అమెరికాతో జరుపుతున్న వాణిజ్య చర్చలు ఇందుకు తక్షణ కారణాలుగా వీరు చెబుతున్నారు. వీటికి తోడు మన దేశ సంపన్నులు తమ సంపదను మన రూపాయలలో కాకుండా అమెరికన్ డాలర్లలో, బంగారంలో ఉంచుకోవడానికి ఎగబడుతున్న ధోరణి ఇటీవల బాగా పెరిగింది. విదేశీ ఇన్వెస్టర్లు ఈ రెండు రోజుల్లో రూ.4,335 కోట్ల షేర్లు అమ్మేశారు. 2025 జనవరి నుండి డిసెంబర్ 2వ తేదీ నాటికి 1.5 లక్షల కోట్ల విలువ చేసే షేర్లను అమ్మి సంపదను తరలించుకుపో యారు. విదేశాల నుండి మన దేశంలోకి బంగారం దిగుమతులు గత ఐదు నెలల్లో మూడు రెట్లు పెరిగాయి. ఇదే సమయంలో ట్రంప్ సుంకాల వల్ల అమెరికాకు మన ఎగుమతులు 28 శాతం పడిపోయా యి. రష్యాకు బదులు అమెరికా నుండి అధిక ధరకు చమురు దిగుమతి చేసుకోవడం పెరిగింది. సంపద సృష్టించేది సంపన్నులే అని నిత్యం జపించే పాలకులు నేడు రూపాయి పతనానికి కారణమవుతున్న ఈ సంపన్నుల గురించి మాట్లాడడంలేదు. ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలవిల కొట్టుకుంటుంటే ప్రధానమంత్రి మాత్రం ప్రధాని కార్యాలయం పేరు మార్పు, ప్రతిపక్షాలపై 'డ్రామా' విమర్శలు చేయడంలో బిజీగా వున్నారు. ఆయనను కీర్తించే వార్తాపత్రికలు, మీడియా సంస్థలు 'మరక కూడా మంచిదే' అన్నట్లుగా రూపాయి పతనం కూడా మంచిదే అని కథనాలు ఇచ్చే సాహసం చేస్తున్నాయి. స్వంత కరెన్సీ అనేది ఆ దేశ సార్వభౌమత్వానికి ఒక ముఖ్యమైన కొలమానం. అన్ని దేశాలు తమ స్వంత కరెన్సీతో వివిధ దేశాలతో వ్యాపారాలు చేస్తాయి. ప్రపంచ మార్కెట్‌లో ఆయా దేశాలు చేసే సరుకుల ఎగుమతులు, దేశ అంతర్గత ఆర్థిక స్థిరత్వాన్ని బట్టి కరెన్సీ విలువ పెరగడం, తగ్గడం జరుగుతుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్థూలంగా అమెరికా డాలర్ ప్రపంచ కరెన్సీగా చెలామణిలోకి వచ్చింది. ఈ ఆధిపత్యాన్ని ఉపయోగించుకుని అనేక దశాబ్దాలుగా అమెరికా ప్రపంచంపై ఆర్థిక, సైనిక పెత్తనం చేయగలిగింది. ఈ పెత్తనాన్ని ప్రతిఘటించేందుకు అనేక దేశాలు ప్రయత్నిస్తూనే వున్నాయి. ఏమైనా ఇప్పటికీ అమెరికా డాలర్ పెద్దన్న స్థానంలోనే వుంది. అమెరికా అధ్యక్షుడు మన ప్రధానికి ప్రియమైన మిత్రుడు. వీరి మైత్రీ కాలంలోనే మన రూపాయి పతనం మరింత తీవ్రమైంది. స్వతంత్రం వచ్చిన తొలి 25 సంవత్సరాల తర్వాత మన రూపాయి డాలర్‌తో ఐదున్నర రూపాయల విలువను కోల్పోగా, ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చిన కేవలం ఈ పది నెలల్లో సుమారు ఆరు రూపాయల విలువను కోల్పోయింది.ట్రంప్ ఒత్తిళ్ళకు లొంగుతున్న కేంద్ర పాలకులు: గత కొన్ని సంవత్సరాలుగా అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గింది. డాలర్‌కు పోటీ పెరిగింది. ఉపాధి అవకాశాలు కోల్పోయిన అమెరికా యువత పెద్ద ఎత్తున నిరసనలు చేస్తున్నారు. రాజకీయ రంగంలో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సంక్షోభం నుండి అమెరికా కంపెనీలు, వారి పెట్టుబడి బయటపడాలంటే ఇన్నేళ్ళుగా ప్రపంచానికి చెప్పిన సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలకు భిన్నమైన విధానాలను అమలు చేయాలి. అందుకు ట్రంప్‌ను ఎన్నుకున్నారు. ఆయన అసంతృప్తితో వున్న యువతను ఆకర్షించేందుకు అనేక హామీలు, ఆందోళనలను పక్కదారి పట్టించేందుకు జాతి విద్వేషాలను రెచ్చగొట్టే ప్రకటనలతో ఎన్నికల్లో గెలిచాడు. తమ డాలర్ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి, ఖర్చు లేకుండా సంపద పోగేసుకోవడానికి ప్రపంచంపై టారిఫ్ టెర్రరిజం ప్రకటించాడు. కరెన్సీ విలువను తగ్గించుకోవాలని వివిధ దేశాలపై ఒత్తిళ్లు తెస్తున్నాడు. తాను చెప్పినట్లుగా చమురును దిగుమతి చేసుకోవాలంటున్నాడు. అమెరికాలోని విదేశీ ఉద్యోగులను, వీసాదారులను రకరకాలుగా వేధిస్తున్నాడు. వారి నుండి అధిక ఫీజుల వసూళ్లకు సిద్ధమయ్యాడు. అనేక దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాడు. వీటిని అనేక దేశాలు ప్రతిఘటిస్తున్నాయి. మన దేశ బిజెపి పాలకులు మాత్రం ట్రంప్ విధానాలకు లొంగిపోతున్నారు. మన వ్యవసాయ రంగంలోకి అమెరికా కంపెనీలకు ప్రవేశించేందుకు వాణిజ్య చర్చలు సాగిస్తున్నారు. చౌకగా రష్యా నుండి వస్తున్న చమురు దిగుమతులను నిలిపివేసారు. 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఇండియా' నినాదాలు ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి పరచకపోగా గత 19 నెలల కనిష్ట పతనానికి కారణమయ్యారు. బెల్లం వున్నచోటే ఈగలు వుంటాయన్నట్లుగా ఇక్కడ లాభపడిన దేశీయ సంపన్నులు తమ సంపదను తరలించుకపోవడమే కాకుండా పౌరసత్వాన్ని కూడా రద్దు చేసుకుని లాభాలు వచ్చే చోటికి వెళ్ళిపోతున్నారు. ఈ పరిణామాలన్నీ రూపాయి పతనానికి కారణాలయ్యాయి. ప్రజలపై పెరగనున్న భారాలు: రూపాయి విలువ పడిపోతే మనం విదేశాల నుండి దిగుమతి చేసుకునే అన్ని సరుకుల ధరలు పెరిగిపోతాయి. మన దేశ అవసరాల్లో 80 శాతం ముడి చమురును విదేశాల నుండి డాలర్ రూపంలోనే కొనుగోలు చేస్తున్నాము. ఏటా సుమారు 170 కోట్ల బ్యారెల్ల ముడి చమురు మనకు విదేశాల నుండి దిగుమతి అవుతుంది. 2022–23లో అప్పటి రూపాయి విలువ రూ.82.60 పైసల ప్రకారం ముడి చమురు దిగుమతి కోసం 12 లక్షల కోట్లు ఖర్చు అయ్యింది. ఇప్పుడు అంతే మొత్తం దిగుమతి చేసుకోవాలంటే సుమారు 2 లక్షల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. కోట్లమంది గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఖర్చు చేస్తున్న సుమారు 48 వేల కోట్లకు నాలుగు రెట్లు ఖర్చు చేయాలి. ఈ భారం పెట్రోలు, డీజల్, గ్యాస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా వినియోగిస్తున్న 140 కోట్ల మంది భారతీయలపై పడుతుంది. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతాయి. కోట్లమంది ప్రజలకు పౌష్టికాహారం కాదుకదా కనీస ఆహారం కూడా అందుబాటులో వుండదు. అలాగే విదేశీ ముడిపదార్థాలపై ఆధారపడిన ఆటోమొబైల్, రసాయన పరిశ్రమలు ఎక్కువ డబ్బు చెల్లించి దిగుమతి చేసుకోవలసి వస్తుంది. పెరిగిన ఉత్పత్తి ఖర్చుకు తగ్గట్టుగా అమ్మకాలు వుండకపోవడంతో పరిశ్రమలు మూత పడతాయి. నిరుద్యోగం పెరుగుతుంది. మన ఎగుమతులు మరింతగా తగ్గి దిగుమతి ఖర్చులు పెరుగుతాయి. విదేశాలకు చెల్లించాల్సిన అప్పుల భారం పెరిగిపోతుంది. విదేశీ వాణిజ్య లోటును మరింతగా పెంచుతాయి. దీన్ని భర్తీ చేసుకోవడానికి షరతులతో కూడిన అప్పుల కోసం ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ దగ్గరకు క్యూ కట్టాల్సి వస్తుంది. రూపాయి బలపడాలంటే!: విదేశీ, స్వదేశీ కార్పొరేట్ అనుకూల ప్రపంచీకరణ విధానాలను విడనాడాలి.

# యేసు బోధించిన మానవతా విలువలు ప్రస్తుత సమాజానికి అత్యవసరం

**- బేతెల్ గోస్పెల్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు**

**- కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి**







**కాప్రా, డిసెంబర్ 25, (తెలంగాణ దిశ)** :కాప్రా సర్కిల్ పరిధిలోని బేతెల్ గోస్పెల్ చర్చిలో గురువారం క్రిస్మస్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సురపనేని ప్రభు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి క్రైస్తవులు భారీగా తరలి వచ్చారు. ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల చారి మాట్లాడుతూ క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ జన్మదినాన్ని క్రైస్తవులు జరుపుకొనే క్రిస్మస్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఎంతో పవిత్రంగా భావిస్తారని అన్నారు. జీసస్ కరుణామయుడుగా, దయామయుడుగా ఆరాధనలు అందుకుంటున్నారని అన్నారు. నాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత జీవనం, శత్రువుల పట్ల సైతం క్షమా గుణం కలిగి ఉండటమే యేసుక్రీస్తు అందరికి ప్రబోధించారని, దీనిని అనుసరించాలని ఆయన ఆకాంక్షించారు. యేసుక్రీస్తు జననం సర్వ మానవాళి పాపాలను క్షమించి, ప్రేమ, సమానత్వం, శాంతి సందేశాన్ని అందించేందుకు దేవుని రూపంలో జన్మించారని పేర్కొన్నారు. ప్రతి జీవిని ప్రేమతో చూడాలని, యేసు బోధించిన మానవతా విలువలు నేటి సమాజానికి అత్యవసరమని అన్నారు. యేసుక్రీస్తు జీవితం ప్రపంచానికే ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరపనేని అనుప్, నాదెండ్ల భాస్కరరావు, శంకర్ రావు, ఇతర కాలనీల వాసులు, క్రైస్తవ సంఘ సభ్యులు హాజరయ్యారు. క్రిస్మస్ ఉత్సవాలను ఆనందంగా జరుపుకున్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ సుపరిపాలన దినోత్సవం







**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 25, (తెలంగాణ దిశ)** :భారతరత్న మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్ పేయి శత జయంతి ఉత్సవాలు భౌరంపేట్ 295 డివిజన్ సింహపురి కాలనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష?రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి, జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షురాలు, భౌరంపేట్ మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, రాష్ట్ర ఎస్టీ మోర్చా శ్యామ్ రావు, నల్ల రామచంద్రారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా బీజేపీ పార్టీ జండా ఆవిష్కరణ చేసి అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా వాజ్ పేయి చిత్రపటానికి నివాళులు అర్పించి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాజ్ పేయి దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి అని అన్నారు. ఆ జన్మ బ్రహ్మచారి గా భరతమాత ముద్దుబిడ్డగా భారతరత్నగా కార్యదక్షుడుగా రాజనీతిఙ్ఞుడుగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనునిత్యం దేశ హితం కోసమే తపించి పోక్రాన్ అణు ప్రయోగం చేసి ఒక్కసారి ప్రపంచానికి భారతదేశ పవర్ ఏంటో చూపించారని అన్నారు. ప్రతి గ్రామానికి ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ప్రారంభించి గ్రామాలలో అభివృద్ధి వెలుగులు నింపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోనె మల్లారెడ్డి, ఎంబరి ఆంజనేయులు, డి సీతారాంరెడ్డి, తురాయి భానుగౌడ్, డి ప్రభాకర్ రెడ్డి, ఆర్. నర్సింహా చారీ, ఏ శ్రీనివాస్ యాదవ్, ఆకుల విజయ్ కుమార్, ఎన్. రోజా, ఎం అతీష్ బాబు, అందె అశోక్, క్యాసారం రాజు, సారా నవీన్, చిన్నా ముదిరాజ్, చింతకాయల నవీన్, కార్యక్రమ సహాయకులు మురళి కృష?, నల్ల రాజిరెడ్డి, పి. ప్రమోద్ కుమార్, అశోక్ రెడ్డి,రామ్, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అటల్ బిహారీ వాజ్ పేయ్ జన్మదిన వేడుకలు

**- బీజేపీ చర్లపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు**



**చర్లపల్లి, డిసెంబర్ 25, (తెలంగాణ దిశ)** :భారతరత్న, మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయ్ 101వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీచర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో చక్రిపురం చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వాజ్ పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


చల్ల ప్రభాకర్ మాట్లాడుతూ భారత అభివృద్ధి గమనంలో నవశకానికి నాంది పలికిన మహానేత అటల్ బిహారీ వాజ్ పేయ్ పాలనాదక్షతకు ప్రతీక అని గుర్తుచేశారు. సుపరిపాలనకు నూతన నిర్వచనం చెప్పిన వాజ్ పేయ్ మాటల చాతుర్యం, నిర?యాల్లో దృఢ సంకల్పం, దేశ ప్రయోజనాల పట్ల అచంచల నిబద్ధత భారత రాజకీయాల్లో ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని తెలిపారు. రాజనీతిజ్ఞత, ప్రజాస్వామ్య విలువలు, దేశభక్తికి వాజ్ పేయ్ జీవితం నిజమైన నిదర్శనమని, ఆయన ఆశయాలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కాసుల సురేందర్ గౌడ్, దేవనాథం, ఆనంద్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, గణేష్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, సహదేవ గౌడ్, రమేష్ చౌదరి, విద్యాసాగర్, రాజు, కళావతి, శ్రీకాంత్, శివప్రసాద్, వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వర్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో 23వేల ఎకరాల్లో..

### ఇండస్ట్రియల్ పార్క్

అనంతపురం : సత్యసాయి జిల్లాలో 23 వేల ఎకరాల్లో భారీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కానుంది. కొడికొండ చెక్‌పోస్టు వద్ద లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కేటాయించిన భూములను కలుపుతారు. 16 రకాల పరిశ్రమల కోసం జోన్లుగా విభజిస్తారు. లీ అండ్ అసోసియేట్స్ మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోంది. బెంగళూరుకు దగ్గరగా ఉండటంతో ఐటీ పరిశ్రమలకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. భూసేకరణకు ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మంజూరు చేసింది.ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకానుంది. ఏకంగా 23వేల ఎకరాల్లో ఈ మెగా పార్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో కొడికొండ చెక్‌పోస్టు సరిహద్దులో ఈ పార్కు ప్లాన్‌చేస్తుండగా.. లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు గతంలో కేటాయించిన భూములను కూడా ఇందులో కలుపుతారు. మొత్తం 16 రకాల పరిశ్రమల కోసం జోన్లుగా విభజిస్తారు. లీ అండ్ అసోసియేట్స్ సంస్థ ఈ పార్కుకు మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తోంది. లేపాక్షికి గతంలో ఇచ్చిన 8,844 ఎకరాలు పోగా మిగిలిన భూమిని సేకరిస్తున్నారు.

# మత్తు.. బంధాలను చంపేస్తోన్న ముప్పు..




అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు ప్రయోజకులైతే ఆ తల్లిదండ్రులకి ఎంత సంతోషం! చదువులో చురుకుగా ఉన్న పిల్లలని చూసి మురిసిపోని అమ్మానాన్న ఎవరైనా ఉంటారా! విద్యార్థులు ఉన్నత స్థానాలకి ఎగబాకితే ఆ ఉపాధ్యాయులకి ఎంత గర్వకారణం! కానీ ఇప్పుడు చాలా కుటుంబాల్లో ఆ సంతోషం ఆవిరైపోతోంది. తరగతి గదుల్లో విద్యార్థుల ప్రతిభ మసకబారుతోంది. వ్యసనానికి బానిసైన కొడుకు వికృత చేష్టలు చూసి ఓ అమ్మ భయపడుతోంది. జేబులో పెట్టిన డబ్బులు మాయం చేస్తున్నది కొడుకని తెలిసి ఆ తండ్రి గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు. అన్నని చూసి చెల్లి, తమ్ముడిని చూసి అక్క రాత్రుళ్లు ఒంటరిగా నిద్రపోలేకపోతున్నారు. భార్యభర్తలు జీవితంలో కలలు కన్న అందమైన ప్రపంచం ఉన్నట్లుండి అదృశ్యమవుతోంది. బంధాలను ఇంతలా బీటలు వారిస్తున్న ఈ మత్తు.. మనిషిని కాదు, అతని గుణాన్ని నిట్టనిలువునా చంపేస్తోంది. మనిషితో ఉన్న ప్రతి సంబంధాన్ని నాశనం చేస్తోంది. గంజాయి రూపంలో వికటాట్టహాసం చేస్తున్న ఈ వ్యసనానికి బలౌతున్న కుటుంబాలు ఎన్నో.. ఒక కుటుంబం కరిగిపోయింది: మనోజ్ (పేరు మార్చాం) చదువులో చురుకైన విద్యార్థి. చెల్లి అంటే ఎంతో ప్రేమ. ఎప్పుడూ అమ్మతో పాటే ఉండేవాడు. కానీ కొన్ని రోజుల నుండి మనోజ్ ప్రవర్తన మారిపోయింది. 'ఒకసారి రుచి చూస్తే ఏమవుతుంది' అనుకుని సరదాగా మొదలుపెట్టిన గంజాయి వ్యసనం ఆ కుటుంబంలో పెద్ద కల్లోలం తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఆ కుటుంబంలో మునుపటి నవ్వులు లేవు. ఆటలు, సంతోషాలు లేవు. అంతా మౌనం.. మనోజ్ ఎవరితో మాట్లాడం లేదు. మౌనంగా తన గదిలో ఒంటరిగా గడుపుతున్నాడు. కొడుకులో వచ్చిన విపరీత ప్రవర్తన ఆ తల్లిదండ్రులకి కంటి నిండా నిద్రని దూరం చేసింది. బిడ్డ భవిష్యత్తు ఏమవుతోందని ఆ అమ్మానాన్న ఏడ్వని రోజు లేదు.

పెద్దకల.. ఛిద్రమైన జీవితం: అవినాష్.. (పేరు మార్చాం) విశాఖపట్నం వాసి. ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారుల గారాల కొడుకు. ప్రముఖ టెక్నాలజీ కాలేజీలో అడ్మిషన్ కోసం విశ్వప్రయత్నం చేశాడు. అయితే ఎలా? ఎప్పుడు? మొదలైందో తెలియదు కానీ అతను డ్రగ్స్‌కి అలవాటు పడ్డాడు. ఈ వ్యసనం అవినాష్ లక్ష్యాన్ని నీరుగార్చింది. చదువులో ఏకాగ్రత తగ్గింది. దీంతో అమ్మానాన్న తమ పలుకుబడితో మేనేజ్‌మెంట్ కోటాలో సీటు సంపాదించారు. అయినా, వ్యసనం అవినాష్ చదువుని అర్ధాంతరంగా ముగించింది. ఉద్యోగం ఉన్నా కుటుంబం దూరం: తిరుపతికి చెందిన రాజేష్ (అసలు పేరు కాదు) విద్యార్థిగా ఉన్నప్పుడు వ్యసనపరుడు కాదు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నప్పుడు డ్రగ్స్‌కి అలవాటుపడ్డాడు. కోవిడ్ టైంలో ఇంటి వద్ద నుండే పనిచేసే వీలున్నా రాజేష్ ఇంటికి రావడానికి ఇష్టపడలేదు. అక్కడే 'రూమ్‌లో ఉండి పనిచేస్తా' అన్నాడు. అమ్మానాన్నకి ఏదో అనుమానం వచ్చింది. ఒకరోజు ఉన్నట్లుండి రాజేష్ ఉంటున్న ఫ్లాట్‌కి వెళ్లారు. అక్కడ రాజేష్, అతని స్నేహితులతో కలిసి డ్రగ్స్ సేవించి మత్తులో జోగుతున్నాడు. ఈ దృశ్యం అమ్మానాన్నకి తీరని వేదన మిగిల్చింది. తాడేపల్లి విషాదాలు..: గుంటూరు జిల్లా తాడేపల్లిలో అమ్మానాన్న, ఇద్దరు కొడుకులతో ఓ అందమైన కుటుంబం నివసిస్తోంది. కాలేజీకి వెళుతున్న పెద్ద కొడుక్కి గంజాయి అలవాటైంది. పిల్లాడిలో వస్తున్న విపరీత ప్రవర్తనకి కలత చెందిన తండ్రి అనారోగ్యానికి గురై మరణిం చాడు. అతడు కన్నుమూసిన కొన్ని నెలలకే కొడుకుని మార్చలేక తల్లి కూడా ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడం, అన్న మత్తు పదార్థాలకి బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవడంతో స్కూల్లో చదువుతున్న తమ్ముడు, నానమ్మ ఇంట్లో తలదాచుకున్నాడు. వ్యసనం ఆ కుటుంబం మొత్తాన్ని చిన్నాభిన్నం చేసింది. తాడేపల్లిలోనే మరో రెండు కుటుంబాల్లో సమాజం సిగ్గుపడే సంఘటనలు జరిగాయి. తీరిక లేని పనితో ఉద్యోగాలు చేసుకుంటున్న తల్లిదండ్రులున్న ఆ కుటుంబాల్లో పిల్లలకి ఎప్పుడు? ఎలా అలవాటైందో తెలియదు డ్రగ్స్‌కి బానిసలయ్యారు. మత్తులో ఉన్న ఆ పిల్లలు వావి వరసలు మరిచిపోయి ప్రవర్తించారు. తోబుట్టువులు గర్భవతులయ్యేదాకా ఆ విపరీతం వెళ్లింది.

# గంట చూసినా గండమే!

డిజిటల్ కంటి ఒత్తిడి.. ఆధునిక ఆరోగ్య సంక్షోభంగా మారుతున్నది. రోజుకు ఒక గంటసేపు స్మార్ట్‌ఫోన్‌తో గడిపినా.. ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. మానసిక, శారీరక ఇబ్బందులను కలిగిస్తున్నది. 'జర్నల్ ఆఫ్ ఐ మూమెంట్ రీసెర్చ్'లో ప్రచురితమైన తాజా అధ్యయనం.. ఈ విషయాన్ని వెల్లడించింది. రీల్స్ చూడటం, ఈ బుక్స్ చదవడం లాంటివి.. తీవ్రమైన కంటి అలసట, ఆందోళనతోపాటు నిద్ర సమస్యలనూ కలిగిస్తున్నట్లు తేల్చింది. భారతీయ యువతలో స్మార్ట్‌ఫోన్ వాడకం, కంటి సమస్యలపై ఈ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రోజుకు కనీసం గంటసేపు స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న వారి హెల్త్ డేటాను పరిశీలించారు. స్మార్ట్‌ఫోన్‌లో ఈ-బుక్ రీడింగ్, వీడియోలు చూడటం, సోషల్ మీడియా రీల్స్ (చిన్న వీడియోలు) ఉపయోగించడం లాంటి కార్యకలాపాలను రికార్డ్ చేశారు. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 60 శాతం మంది స్మార్ట్‌ఫోన్‌ను ఎక్కువసేపు ఉపయోగించిన తర్వాత తీవ్రమైన అసౌకర్యాన్ని అనుభవించినట్లు చెప్పారు. కంటి అలసట, మెడ నొప్పి, చెయ్యి లాగడం లాంటి లక్షణాలు ఉన్నట్లు వెల్లడించారు. 83 శాతం మందిలో ఆందోళన, నిద్రాభంగం, మానసిక అలసట వంటి రుగ్మతలను ఎదుర్కొంటున్నట్లు చెప్పుకొచ్చారు. ఇందుకు గల కారణాలను అధ్యయనకారులు వివరిస్తూ.. సోషల్ మీడియా రీల్స్ స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ వైవిధ్యాలను పెంచుతాయని అంటున్నారు. వీడియోలకు తగ్గట్టుగా స్క్రీన్ బ్రైట్‌నెస్ పెరగడం, తగ్గడం జరుగుతుంది. ఇక ఈ బుక్స్‌లో చిన్నచిన్న అక్షరాలను చదవడం.. కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇలాంటి మార్పుల కారణంగా కనుపాప తీవ్రంగా ప్రభావితం అవుతుంది.



ఇక ఒకేసారి 20 నిమిషాలకు మించి స్మార్ట్‌ఫోన్ వాడితే.. శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. డిజిటల్ పరికరాలు విడుదలచేసే నీలికాంతికి ఎక్కువసేపు గురికావడం వల్ల కంటి అలసట, నిద్ర రుగ్మతలు, దృశ్య సంబంధిత సమస్యలు వస్తాయని సర్వే ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. డిజిటల్ పరికరాలపై గడిపే సమయం మాత్రమే కాకుండా.. ఉపయోగిస్తున్న కంటెంట్ కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నియంత్రణ ఉండాలని సూచిస్తున్నారు.

# భారీగా తగ్గనున్న మెడికల్ కేర్ ప్రొడక్ట్స్

ముంబై: ప్రధాని నరేంద్రమోదీ.. భారత ప్రజలకు ఒక హామీ ఇచ్చారు. దీపావళికి డబుల్ ధామాకా ఇస్తామని ప్రకటించారు. జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) విధానంలో కీలక సంస్కరణలను ఈ దీపావళి నాటికి అమలు చేస్తామని తెలిపారు. ఈ సంస్కరణలు సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు, మధ్య మరియు చిన్న తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలకు) ఊరట కలిగించనున్నాయి. ఈ మార్పుల ద్వారా రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గనున్నాయని, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే విధంగా జీఎస్టీ వ్యవస్థ సరళీకరణ జరుగుతుందని మోదీ సూచించారు. ప్రధానమంత్రి మోదీ ప్రకటన ప్రకారం, జీఎస్టీ విధానంలో "తదుపరి తరం సంస్కరణలు" (జీఎస్టీ 2.0) ఈ దీపావళి నాటికి అమలులోకి వస్తాయి. ప్రస్తుత జీఎస్టీ నిర్మాణంలో ఐదు పన్ను స్లాబ్‌లు (0%5%,12%,18%, 28%), విలాసవంతమైన, హానికర వస్తువులపై అదనపు సెస్ ఉన్నాయి. సంస్కరణలతో స్లాబ్‌లు సరళీకరించనున్నారు. దీంతో ప్రస్తుత 12% స్లాబ్‌ను రద్దు చేసి, ఈ స్లాబ్‌లోని వస్తువులను 5% లేదా 18% స్లాబ్‌లకు బదిలీ చేయాలనే ప్రతిపాదన ఉంది. దీనివల్ల జీఎస్టీ నిర్మాణం సరళమవుతుంది. రోజువారీ వినియోగ వస్తువులు, గృహోపకరణాలు, ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లను తగ్గనున్నాయి. 28% స్లాబ్‌లోని వస్తువులలో 90% వస్తువులు 18% స్లాబ్‌కు, 12% స్లాబ్‌లోని 99% వస్తువులు 5% స్లాబ్‌కు మారే అవకాశం ఉంది. విలాసవంతమైన మరియు హానికర వస్తువులపై విధించే కంపెన్సేషన్ సెస్‌ను 40% ఏకరీతి రేటుగా మార్చాలని ప్రతిపాదన. ఇది ప్రస్తుత సెస్ రేట్లను (1% నుంచి 290% వరకు) సరళీకరిస్తుంది. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సమస్యలను పరిష్కరించడానికి ఇన్వర్టెడ్ డ్యూటీ నిర్మాణాన్ని సరిచేయడం, రిఫండ్ ప్రక్రియలను సరళీకరించడం లక్ష్యంగా ఉంది. ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన వస్తువుల జాబితాను పేర్కొనకపోయినప్పటికీ, నిపుణుల అంచనాల ప్రకారం.. కొన్ని రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఇతర గృహ వినియోగ ఉత్పత్తులపై 28% నుంచి 18%కి జీఎస్టీ తగ్గవచ్చు. ఫ్రూట్ జ్యూస్‌లు, బటర్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, డ్రై ఫ్రూట్స్, సాసేజ్‌ల వంటి ఉత్పత్తులు 12% లేదా 28% నుంచి 5% లేదా 18% స్లాబ్‌కు మారవచ్చు. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, గాజ్, బ్యాండేజ్‌లు, డయాగ్నస్టిక్ కిట్‌ల వంటి ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గే అవకాశం ఉంది. ఆరోగ్య, జీవన బీమా ప్రీమియంలపై ప్రస్తుత 18% జీఎస్టీని 12% లేదా 5%కి తగ్గించాలని చర్చలు జరుగుతున్నాయి, దీనివల్ల బీమా సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి. 10 రూపాయల లోపు ధర ఉన్న ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులు (షాంపూ, సబ్బు వంటి చిన్న సాచెట్‌లు) 5% స్లాబ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. జీఎస్టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధి, సామాన్య ప్రజల జీవన నాణ్యతపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. ధరల తగ్గింపు వల్ల వినియోగం పెరిగి, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తుంది. లాఫర్ కర్వ్ సిద్ధాంతం ప్రకారం, తగ్గిన పన్ను రేట్లు ఎక్కువ మందిని జీఎస్టీ వ్యవస్థలోకి తీసుకొస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సరళీకృత పన్ను విధానం, తగ్గిన రేట్లు వ్యాపార వ్యయాలను తగ్గిస్తాయి, దీనివల్ల ఈ రంగం బలోపేతమవుతుంది. అయితే పన్ను రేట్ల తగ్గింపు వల్ల ప్రభుత్వ ఆదాయంలో సుమారు 0.15% జీడీపీ నష్టం (500 బిలియన్ రూపాయలు) జరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, దీర్ఘకాలంలో వినియోగం, పన్ను వసూళ్ల పెరుగుదల ఈ నష్టాన్ని భర్తీ చేస్తుందని భావిస్తున్నారు. ఈ సంస్కరణలు దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రెండు స్లాబ్‌ల విధానం ద్వారా వ్యాపారాలకు నియమ నిబంధనలు సరళమవుతాయి, పన్ను వివాదాలు తగ్గుతాయి. రోజువారీ వస్తువుల ధరల తగ్గింపు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. సెస్ రద్దు, రేట్ల సరళీకరణ ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది.

# బెంగళూరులో ఆపిల్ భారీ ప్రాజెక్ట్..!

బెంగళూరు: ఆపిల్, ప్రపంచంలోని అతిపెద్ద టెక్ దిగ్గజాల్లో ఒకటి, భారతదేశంలో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించింది. తాజాగా భారత మార్కెట్‌ను మరింత సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది. భారీగా పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమవు తోంది. బెంగళూరులో 2.7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కార్యాలయ స్థలాన్ని పదేళ్ల లీజు ఒప్పందంతో సొంతం చేసుకుం ది. ఈఒప్పందం విలువ విలేవే రూ. 1,000 కోట్లకు పైగా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యాలయం తొమ్మిది అంతస్తుల్లో విస్తరించి ఉండి, పార్కింగ్, ఇతర సౌకర్యాలను కలిగి ఉంది. నెలకు రూ.6 కోట్ల రెంట్‌తో, ఇది భారతదేశంలో అతిపెద్ద కార్యాలయ లీజు ఒప్పందాల్లో ఒకటిగా నిలిచింది. ఈ లీజు ఒప్పందం ఆపిల్ భారత్‌పై దీర్ఘకాలిక నిబద్ధతను సూచిస్తుంది. 2.7 లక్షల చదరపు అడుగుల స్థలం కోసం రూ. 1,000 కోట్ల విలువైన పదేళ్ల ఒప్పందం అనేది ఒక సాధారణ రియల్ ఎస్టేట్ ఒప్పందం కాదు. నెలవారీ రూ. 6 కోట్ల రెంట్, సంవత్సరానికి నిర్దిష్ట శాతం పెరుగుదలతో, ఈ ఒప్పందం ఆర్థిక దృష్ట్యా భారీగా ఉందని చెప్పవచ్చు. ఈ కొత్త కార్యాలయం ఆపిల్ యొక్క ఇంజనీరింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ), సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందాలకు స్థలం కల్పిస్తుంది. బెంగళూరు, భారతదేశ టెక్ రాజధానిగా పిలవబడే నగరం, దాని నైపుణ్యం కలిగిన టెక్ ప్రొఫెషనల్స్, ఆవిష్కరణలకు కేంద్రంగా ఉండటం వల్ల ఆపిల్ ఈ నగరాన్ని ఎంచుకుంది. ఈ కార్యాలయం ఆపిల్ ఉత్పత్తుల అభివృద్ధి, ముఖ్యంగా ఐఫోన్, ఇతర టెక్ సొల్యూషన్స్‌కు సంబంధించిన పరిశోధనలను మరింత వేగవంతం చేస్తుంది. ఇది స్థానిక ఉద్యోగులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది, దీనివల్ల బెంగళూరు, భారతదేశంలోని టెక్ రంగం మరింత బలోపేతమవుతుంది. ఆపిల్ ఇప్పటికే భారతదేశం నుంచి ఐఫోన్‌ల ఎగుమతిలో అగ్రగామిగా ఉంది. ఈ కొత్త కార్యాలయం ద్వారా, ఆపిల్ తన ఉత్పాదన, ఎగుమతి సామర్థ్యాన్ని మరింత పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారతదేశంలోని తయారీ కేంద్రాల నుంచి ఐఫోన్‌లను ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేయడం ద్వారా, ఆపిల్ భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిస్తోంది. ఈ కార్యాలయం ద్వారా స్థానిక ఉత్పాదన, ఆవిష్కరణలు, ఎగుమతు లు మరింత ఊపందుకుంటాయని పరిశ్రమ నిపుణులు మాత్రమే కాక, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక వరంగా ఉంటుంది.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ రణం

## 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ప్రకటన

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** విశాఖ స్టీల్ ప్లాంట్ చుట్టూ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రైవేటీకరణ అంశం గత కొన్నేళ్లుగా కుదిపేస్తోంది. అయితే ఈ ప్లాంట్ విషయంలో మాత్రం కేంద్రం అనుసరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. కొద్ది రోజుల కిందట కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. దీంతో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అనేది జరగదని అంతా భావించారు. కూటమి నేతలు సైతం స్టీల్ ప్లాంట్ విషయంలో అనేక రకాలుగా భరోసా కల్పిస్తూ.. నమ్మకమైన ప్రకటనలు చేశారు. అయితే ఇటువంటి పరిస్థితుల్లో తాజాగా ఓ పరిణామం జరిగింది. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం పలు విభాగాలను ప్రైవేటు పరం చేసేందుకు టెండర్లు జారీచేసింది. దీంతో కార్మికులతో పాటు ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. ప్రైవేటీకరణ లో భాగంగానే ఇలా చేస్తున్నారన్న అనుమానాలు మొదలయ్యాయి. కార్మికులు,ఉద్యోగులు ఆందోళన బాట పడుతున్న నేపథ్యంలో ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేయడంపై విస్మయం వ్యక్తం అవుతోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం అనుకున్నది సాధించి తీరుతుందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అనేది ఇప్పటిది కాదు. ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ చేసి తీరుతామని కేంద్రం పలుమార్లు స్పష్టం చేసింది. అదే సమయంలో వివరణ కూడా ఇచ్చింది. ఒకవైపు ప్రైవేటీకరణకు సంబంధించి ప్రకటనలు వచ్చాయి. మరోవైపు కేంద్ర మంత్రులు నేరుగా వచ్చి స్టీల్ ప్లాంట్ విషయంలో భరోసా ఇచ్చే ప్రయత్నాలు చేశారు. ప్లాంట్ ఉత్పత్తులకు సంబంధించి ఆర్థిక ప్యాకేజీ పదకొండు వేల కోట్ల రూపాయలను అందించింది కేంద్రం. దీంతో ప్రైవేటీకరణ అనేది నిలిచిపోయిందని అంతా భావిస్తున్న తరుణంలో ఆజాగా వెలువడిన ఒక నోటిఫికేషన్ సరికొత్త సమస్యను తెరమీదకు తెచ్చింది. అంచలంచెలుగా.. దశలవా రీగా ప్లాంట్ ను ప్రైవేటు పరం దిశగా అడుగులు పడుతున్నట్లు స్పష్టమవుతోంది. కర్మాగారాన్ని రక్షిస్తామని యాజమాన్యం ఒక వైపు ప్రకటనలు చేస్తూనే ఉన్నా.. మరోవైపు దశలవారీగా విభాగాలను ప్రైవేటీకరించేందుకు సిద్ధపడుతుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. స్టీల్ ప్లాంట్ లో చాలా రకాల విభాగాలు ఉంటాయి. అందులో ప్రస్తుతం 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ఉక్కు యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై ఉద్యోగులతో పాటు కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. యాళ్ల తరబడి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తూ వచ్చారు. అయినా సరే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. ఒక పద్ధతి ప్రకారం స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించేందుకు అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు కొన్ని విభాగాలను ప్రైవేటీకరించేందుకు వరుసగా నోటిఫికేషన్లు జారీచేసింది యాజమాన్యం. తాజాగా ఒకేసారి 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ప్రకటన విడుదల చేసింది. దీంతో కార్మికులతో పాటు ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు ప్లాంట్ కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెబుతోంది. ఇప్పుడు ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. వాస్తవానికి ఎట్టి పరిస్థితుల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాదని కూటమి నేతలు హామీ ఇచ్చారు. కేంద్రంలో ఇప్పుడు తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. ఆపై పవన్ కళ్యాణ్ సైతం గుర్తింపు కలిగిన నాయకుడిగా ఉన్నారు. ఆయన సైతం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరిస్తే ఊరుకోమని హెచ్చరించారు కూడా. ప్లాంటు భవితవ్యం పై చాలా రకాలుగా హామీలు ఇచ్చారు. మరింత కష్టపడి ప్లాంట్ ఉత్పత్తిని కూడా పెంచాలని సూచించారు. దీంతో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నారు ఉద్యోగులతో పాటు కార్మికులు. ఇలా చేస్తున్న క్రమంలో ఒక్కో విభాగాన్ని ప్రైవేట్ పరం చేయడం మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకవేళ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే కూటమి నేతలపై సైతం ఒత్తిడి పెరగడం ఖాయం.



# బ్రిటిషోల్లను హడలెత్తించిన విప్లవవీరుడు రాజ్ గురు

బ్రిటిషోల్లను హడలెత్తించిన విప్లవవీరుడు కామ్రేడ్ శివరాం రాజ్ గురు.. ఆయన మహారాష్ట్ర పూణే దగ్గరలోని కేడు గ్రామంలో పార్వతి దేవి హరి నారాయణ రాజు గురు దంపతులకు 1908 బ్రాహ్మణ కుటుంబం లో జన్మించిన విప్లవ కిశోరం. కామ్రేడ్ శివ రామ్ రాజగురు చిన్నప్ప టి నుంచే జాతీయ భావాలతో పెరిగారు. రాజ్ గురు స్వాతంత్ర పోరాటం వైపు పయనించాడు. 1928 ఫిబ్రవరిలో భారతదేశ పర్యటనకు వచ్చినటువంటి సైమన్ కమిషన్ గోబ్యాక్ అంటూ జరిగిన పోరాటానికి నాయకత్వం వహించిన లాలాలజపతిరాయ్ పోలీసులు లాఠీఛార్జి కిరాతకంగా హత్య చేశారు. సైమన్ కమిషన్ లో ఒక భారతదేశ సభ్యులు కూడా లేకపోవడం భారతీయుల్లో మరింతగా ఆవేశం వచ్చింది. లాలాలజపతిరాయ్ మృతిపట్ల భారతదేశంలో యువత లో తీవ్రమైన వ్యతిరేకత రావడం బ్రిటిష్ పాలనను ఎలాగైనా తరిమికొట్టాలని లక్ష్యంతో సాగారు. చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ సంస్థ ఆధ్వర్యంలో దేశంలోనే యువతలో చైతన్యం చేస్తూ భారత స్వాతంత్ర పోరాటంలో యువతను భాగస్వామ్యం చేయడం కోసం కీలకమైన కృషి చేయడం జరిగింది. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని లక్ష్యంతో జరుగుతున్న పోరాటంలో హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో రాజ్ గురు కూడా సభ్యులుగా చేరారు. లాలాలజపతిరాయ్ లాఠీఛార్జ్ చేసిన అధికారిని ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో భగత్ సింగ్, రాజ్ గురు ఇతరులు కలిసి పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్నటువంటి జాన్ సాండర్స్ అనే బ్రిటిష్ అధికారి ని కాల్చి చంపడం జరిగింది.

కొద్దికాలం పాటు అజ్ఞాత వాసం లో ఉంటూ స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించేందుకు దేశవ్యాప్తంగా హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ ఆర్మీ పనిచేసింది. ఢిల్లీలో జరిగిన అసెంబ్లీలో బాంబు వేసి భగత్ సింగ్ స్వచ్ఛందంగా లొంగిపోవడంతో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించా రు. కొద్దికాలం తరువాత ఈ కేసులో ప్రమేయం ఉందని అనుమా నించిన పోలీసులు అధికారులు రాజ్ గురును కూడా అరెస్ట్ చేయడం జరిగింది. సాండర్స్ హత్య కేసులో భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురు ఉరి తీయాలని తీర్పు ఇవ్వడం జరిగింది. 1931 మార్చి 23 వ తేదీన లాహోర్ జైల్లో విప్లవ కిశోరాలను ఉరి తీయడం జరిగింది. ఇంక్విలాబ్ జిందాబాద్ బ్రిటిష్ వలస పాలన మాకొద్దు అంటూ స్వాతంత్ర్యమే మా జన్మహక్కని నినాదాలు చేస్తూ వీర మరణం పొందారు. ఉరితీసిన నాటికి భగత్ సింగ్,సుఖదేవ్ ల వయస్సు 23 సంవత్సరాలు అయితే రాజుగురు వయస్సు 22 సంవత్సరాలే దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం వీర మరణం పొందిన వంటి వీరుల త్యాగాలు మరువలేనివి.

# డబుల్ ఇంజన్ లేకుంటే పట్టించుకోరా?

రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం లేకుంటే...అక్కడ అభివృద్ధి పనులు సాగవా? అక్కడి ప్రజలను దేశప్రజలుగా బిజెపి చూడడం లేదా...రాష్ట్రం ఏదైనా బిజెపి అధికారంలో ఉండి డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటేనే సహకారం అందిస్తారా? ఇప్పుడు తెలంగాణ విషయంలో అదే కనిపిస్తోంది. ఎపితో పోలిస్తే తెలంగాణ పట్ల నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండొచ్చు గాక..ప్రజలనుపీడించడం ఎందుకు. పథకాలను ఆపడం ఎందుకు..నిధులను ఆపడం ఎందుకు...గత పదేళ్ల బిఆర్ఎస్ హయాంలోనూ... ఇప్పుడు కాంగ్రెస్ హయాంలోనూ ఇదే జరుగుతోంది. అవినీతి జరిగితే చర్యలు తీసుకోరు. కేవలం విమర్శలు చేసి ఊరుకుంటున్నారు. ఇలా చేయబట్టే కాళేశ్వరం విషయంలో లక్షకోట్లు తెలంగాణ ప్రజలు మునిగారు. ఇక ఎపిలో ఈ ఏడాదిలో నిధులు వరదలా పారుతున్నాయి. కేంద్రమంత్రులు ఎపికి క్యూ కట్టారు. వరాలు కోరుడు ఆలస్యం అన్నట్లుగా అన్నీ నెరవేరుస్తున్నారు. అక్కడి కేంద్రమంత్రులు నిలబడి సమస్యలను ప్రస్తావిస్తూ.. పరిష్కారాలు వెదుకుతున్నారు. దీనికి ఎవరికీ అభ్యంతరం లేదు. అక్కడా అభివృద్ధి జరగాల్సిందే. కానీ తెలంగాణను వెనకేయడం మాత్రం సరికాదు. కానీ తెలంగాణలో మాత్రం ఇద్దరు కేంద్ర మంత్రులు దుమమెత్తి పోయడానికే ఉన్నారు. నిరంతరాయంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టడానికే సరిపోతోంది. రాజకీయంగా తిట్టు ఎలా ఉన్నా...ఢిల్లీ స్థాయిలో నిలబడి తెలంగాణకు రావాల్సిన నిధులు, పనులను సాధించాల్సి ఉంది. కానీ బండి సంజయ్, కిషన్ రెడ్డిలు అలా చేయడం లేదు. నిస్సిగ్గుగా.. నిర్లజ్జగా తెలంగాణ పట్ల చూపిస్తున్న వివక్ష గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. నిజంగానే మోడీ తెలంగాణ పట్ల కక్షసాధింపు చాటుకున్నారు. ఒక్క పైసా కూడా కేటాయింపులు లేకుండా కొన్ని రాష్ట్రాలను నిర్లక్ష్యం చేశారు. మొన్నటి బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం చేశారు. ఇందులో నూటికినూరు శాతం నిజం. కేవలం ఎన్‌డిఎ భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే మేలు కలిగేలా తీసుకున్న నిర్ణయాలు సరికాదు. నిజానికి తెలంగాణ లేదా ఏ రాష్ట్రం అభివృద్ధి చెందినా అది దేశం అభివృద్ధికిందకే లెక్క. కానీ అలాంటి ప్రతిపాదన లు తెలంగాణ విషయంలో ఏమీ జరగలేదు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పలుమార్లు ఢిల్లీ చుట్టు తిరిగి వినతిపత్రాలు సమర్పించి నా..సున్నా చూపారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం చుట్టూ తిరుతామని, అభివృద్ధి వేరు, రాజకీయాఆలు వేరని సిఎం రేవతం పదేపదే చెబుతున్నారు. ఏనాడు కూడా రాష్ట్రానికి సంబంధించిన పనులు, నిధులపై సిఎం రేవంత్‌తో ఇద్దరు కేంద్రమంత్రులు చర్చించ లేదు. ఎన్నో ఆశలతో ఇచ్చిన వినతిపత్రాల ను చిత్తు కాగితాల కింద మార్చినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణకే కాదు దేశం మొత్తం మీద బిజెపియేతర రాష్ట్రాల పరిస్థితి ఇలాగే ఉందేమో. అధికారంలో తాము లేకపోతే పట్టించు కోబోమని చెప్పకనే చెబుతున్నారు. అలాగే పేదలను గట్టెక్కించే ప్రయత్నాలు జరగలేదు. ధరలు ఎలా తగ్గించాలో చెప్పడం లేదు. ధరల పెరుగుదలకు కారణమై, సామాన్యుల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ఎలాంటి చర్య లూ ప్రకటించలేదు. ఈ దశాబ్ది ఆఖరికి పదికోట్ల ఉద్యోగాలుసృష్టిస్తా మని ఘనంగా పేర్కొన్నా అందుకు తగిన కార్యాచరణ, నిధుల కేటా యింపూ కనపడ లేదు. ఉద్యోగాలు సృష్టిస్తామన్న మాట,గతంలో మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీలన్నీ డొల్లగా కనిపిస్తోంది. వ్యవసాయ రంగం మీద, ఉపాధి హామీ పథకం మీదా గతంలో మాదిరిగానే మోడీ ప్రభుత్వపు చిన్నచూపు కొనసాగింది. గ్రామీణ వ్యవసాయ కార్మికులకు, చిన్న రైతులకు, పేదలకు తోడ్పాటునిస్తున్న ఉపాధి హామీకి నిధులను తెగ్గోసింది. పాలమూరు-రంగారెడ్డి విషయం పేర్కొనలేదు. ట్రిపుల్ ఆర్ గురించి మాట్లాడడంలేదు. తెలంగాణలోని ప్రాజెక్టులను జాతీయ హోదా ఇవ్వాలని 10 ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా ఆ దిశగా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణం. గత 10 ఏళ్లుగా ప్రతి బడ్జెట్‌లో తెలంగాణ కు కేంద్రం మొండిచేయి చూపడంతో పాటు, అనేక పనులను పెండింగ్‌లో పెడుతున్నారు. కంటోన్మెంట్ నుంచి కరీంనగర్, నిజామాబాద్ రోడ్ల విస్తరణ 12 ఏళ్లయినా ముందుకు సాగడం లేదు. విభజన సమస్యలకు చాపచుట్టేశారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి బిజెపికి చెందిన ఎంపిలను ఎనిమిది మంది గెలిపించినా రాష్ట్రానికి నరేంద్ర మోడీ నిధులు కేటాయించక పోవడం దారుణం కాక మరోటి కాదు. తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా కేంద్రం మాత్రం కనీసం పట్టించుకోవడం లేదు. తెలంగాణ లోని ఏ ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఏఐబిపి స్కీంలోకి తీసుకోకపోవడం విశేషం. తెలంగాణకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వంఒక్క కొత్త ప్రాజెక్టును ప్రకటించలేకపోవడం విశేషం. సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్‌టైల్ పార్కుకు ఆర్థిక సాయం, తెలంగాణలోని ఇండస్ట్రియల్‌కారిడార్లకు నిధులు ఇవ్వడంలో కేంద్రం మొండిచేయి చూపింది. ఎపి రీ ఆర్గనైజేషన్ యాక్ట్‌లో హామీ ఇచ్చిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలను పక్కన పడేశారు. తెలంగాణకు జాతీయ విద్యా సంస్థల కేటాయింపులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదు. తెలంగాణ కోసం ఏమి చేయదల్చుకున్నారో చెప్పాలి. అవసరమైతే కేంద్రంతో కొట్లాడి తెలంగాణఆత్మగౌరవం చాటడంలో కేంద్రమంత్రులు ముందు నిలబడాలి. తెలంగాణ ఫస్ట్..తరవాతే రాజకీయం అన్నది పంథా కొనసాగాలి. ఇక్కడ కాంగ్రెస్ ఉన్నా, రేపు బిజెపి వచ్చినా అభివృద్ధి జరగాలి.

# ఓ వైపు ఆకలి చావులు.. మరోవైపు





**- బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న పాలస్తీనియన్లు**

**- కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణకాండ**

గాజాస్ట్రిప్: ఓవైపు ఆకలి చావులు.. మరోవైపు భీకర దాడులు. గాజా స్ట్రిప్‌లో అనునిత్యం కన్పిస్తున్న దృశ్యాలివి. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఆకలిలో విలవిలలాడిపోతుంటే మరోవైపు ఇజ్రాయిల్ సైనికులు ఏ మాత్రం కనికరం చూపకుండా అమానుషంగా దాడులు చేస్తూనే ఉన్నారు. సహాయ పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన అన్నార్తులు, సామాన్య ప్రజలను కూడా వదలడం లేదు. గాజాను బలవంతంగా ఖాళీ చేయించడమే ఇజ్రాయిల్ ఉద్దేశం. అదే జరిగితే పది లక్షల మంది నిరాశ్రయులవుతారు. వేలాదిమంది ప్రజలు ఇప్పటికే ప్రాణభయంతో పరుగులు తీస్తున్నారు. నగర శివారులో జనసమ్మర్దం అధికంగా ఉండే సబ్రా, తుఫా వంటి ప్రాంతాలు బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. గాజా నగరంలో సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని సైతం బహిష్కరించాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోంది. 2023 అక్టోబరులో ఇజ్రాయిల్ దాడులు మొదలైనప్పటి నుంచి నేటి వరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 62,686కు చేరింది. 1,57,951 మంది గాయాల పాలయ్యారు. గత నెల రోజులుగా ఇజ్రాయిల్ ముమ్మరంగా దాడులు చేస్తోంది. మృతులు, క్షతగాత్రుల్లో అత్యధికులు చిన్నారులు, మహిళలేనని స్వచ్ఛంధ సంస్థలు అంచనా వేస్తున్నాయి. నెట్‌జారిమ్ కారిడర్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడుల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పో యారు. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్ఎఫ్) నిర్వహిస్తున్న సహాయ పంపిణీ కేంద్రం వద్ద వేచిచూస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులు జరిపిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

గాజా ప్రజలకు కాళరాత్రులే: గాజా ప్రజలు భయంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. ఇజ్రాయిల్ సైన్యం దాడులతో నిరంతరాయంగా పేలుడు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. గాయాల పాలైన వారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. పేలుళ్ల ధాటికి గాలిలో దట్టమైన పొగ వ్యాపిస్తోంది. ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చాలా మంది ఊపిరి అందక బాధపడుతున్నారు.

ఆకలికి తాళలేక ఇప్పటి వరకూ 289 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా స్ట్రిప్‌లోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మునిర్ అల్-బర్ష్ తెలిపారు. వీరిలో 115 మంది చిన్నారులే. గత 24 గంటల్లో 64 మృతదేహాలను ఆస్పత్రులకు తీసుకొచ్చారు. అనా రోగ్యాల బారిన పడిన వారికి వైద్య సేవలు కూడా అందడం లేదు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు కూడా ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. నవజాత శిశువులు, చంటిపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్న చిన్నారులు: గర్భిణులకు అవసరమైన పోషకాహారం లభించకపోవడంతో వారికి పుట్టిన పిల్లలు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆకలికి తాళలేక చిన్నా రులు కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు ఉండిపోతున్నారు. నగరంలోని సహాయ గిడ్డంగులు ఖాళీగా దర్శనమిస్తున్నా యి. ఇజ్రాయిల్ ఆంక్షల కారణంగా ఆహారం, మందులు, ఇతర అత్యవసర సామగ్రి సరఫరాలు నిలిచిపోయాయి.

వివిధ దేశాల్లో నిరసనలు: గాజా నగరంలో ఇజ్రాయిల్ సృష్టించిన క్షామాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. గాజాలో మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆస్ట్రేలియాలోని 20 నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బ్రిస్బేన్‌లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న వేలాది ప్రజలు గాజాలోని అన్నార్తులకు తక్షణమే సాయం అందించాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని నినాదాలు చేశారు. ఇజ్రాయిల్‌లో కూడా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. యుద్ధాన్ని ఆపాలంటూ టెల్ అవీవ్‌లో వేలాదిమంది ర్యాలీ తీశారు. అనేక యూరోపియన్ నగరాలలో కూడా ఇజ్రాయిల్ చర్యలను నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

## విశాఖ చుట్టూ టౌన్ షిప్స్



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా నగరీకరణ పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు మరింతగా విస్తరించాలని భావిస్తోంది. నగరాల చుట్టూ కొత్తగా థీమ్ బేస్డ్ పట్టణాలు, టౌన్ షిప్ లు, సిటీస్ నిర్మించాలన్న ఆలోచన చేస్తోంది. నగర జనాభా పెరుగుతున్న దృష్ట్యా.. వారి అవసరాలకు అనుగుణంగా ముందే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే నీతి ఆయోగ్ విశాఖను ప్రత్యేక గ్రోత్ సిటీగా గుర్తించింది. నగరానికి అనుసంధానంగా పట్టణాలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాదాపు 1000 ఎకరాల్లో భూమిని సేకరించనుంది. ఈ విధానాన్ని ఇతర నగరాల్లో కూడా అమలు చేయనున్నారు.విశాఖ నగరం చుట్టూ కొత్త తరహా పట్టణాలు రాబోతున్నాయి. అనకాపల్లి తో పాటు విజయనగరం ప్రాంతాల్లో థీం బేస్డ్ పట్టణాలను, సిటీలను, టౌన్ షిప్ లను అభివృద్ధి చేయనున్నారు. ఐటి, వైద్యం, పర్యాటక రంగం వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ సంస్థలను ఆశ్రయిస్తారు. ప్రస్తుతం విశాఖ జనాభా 21 లక్షలకు దాటింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త పట్టణాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. విశాఖ పరిసర ప్రాంతాల్లో.. విజయనగరం తోపాటు అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. అక్కడ దాదాపు1000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించారు. భూ సమీకరణ పథకం ద్వారా ప్రైవేటుభూములను సమీకరిస్తారు. భూమియజమానులకు నష్టపరి హారం అందిస్తారు. అయితే ఇలా గుర్తించిన భూముల్లో ఐటి,పర్యాట కం,వైద్యం,వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు వంటి విభిన్న రంగాల్లో అభివృద్ధి చేస్తారు. ప్రైవేటు సంస్థలు పెట్టుబ డులు పెట్టడానికి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. తద్వారా స్థానికు లకు సైతం ఉద్యోగాలులభిస్తాయి. ఎప్పటికీ నీతి ఆయోగ్ సిఫార్సులలో విశాఖ కుచోటు దక్కింది. గ్రోత్ సిటీగా గుర్తింపు సాధించింది.అయితే ఇటువంటి నగరాలలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కోట్లు కేటాయించింది. దీని ద్వారా థీమ్ ఆధారిత నగర నిర్మాణాలు సులువు అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఆగని ఎమ్మెల్యేల తప్పిదాలు?

**అనంతపురం,తెలంగాణ దిశ :**కూటమి ప్రభుత్వం ఏర్పాట యిన తర్వాత ఏడాదిలోనే అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. అయితే ప్రభుత్వ పరంగా కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల కాదు. కేవలం ఎమ్మెల్యేల వల్లనే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ ఎమ్మెల్యేలో చాలా మంది పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. లెక్కలేని తనం వారిలో కనిపిస్తుంది. నియోజకవర్గానికి తామే బాస్ లుగా వ్యవహరిస్తున్నారు. తాము ఎన్నికయింది ఎవరి వల్లనన్నది గుర్తించని పరిస్థితుల్లోకి కొందరు ఎమ్మెల్యేలు వచ్చేశారు. అందుకే టీడీపీ నాయకత్వానికి ఈ ఎమ్మెల్యేలతో ఇబ్బందికరంగా మారింది. నిజానికి చెప్పాలంటే చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు తలెత్తని వివాదాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి నాడు ఎమ్మెల్యేలు ఒక పద్ధతిని పాటించేవారు. నియోజకవర్గాల్లో ఎలాంటి అవినీతి పనులకు, అక్రమాలకు వేలు పెట్టేవారు కాదు. అవసరమనుకుంటే స్థానిక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసి వారి మన్ననలను పొందేవారు. కాకుంటే బయట ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడంతో పాటు ఏదో ఒక పెద్ద పైరవీని చేసుకుని తాము ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్న మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఇవేమీ బయటకు వచ్చేవి కావు. కానీ ఇప్పుడు ఇలా కాదు. నియోజకవర్గాల్లోనే ఎమ్మెల్యేలు దుకాణాలు తెరిచారు. ఇసుక, మద్యం ఏ విషయంలోనూ వేలు పెట్టకుండా ఉండలేకపోతున్నారు. నియోజకవర్గం ప్రజల వద్దనే చేతులు కూడా చాచేవారు కూడా లేకపోలేదు. దీనికి తోడు హంగామా, అనుచరుల ముందు ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికి చేస్తున్న వీరంగం చేస్తున్నారు. వీరిని కంట్రోల్ చేయడం నాయకత్వానికి కూడా సాధ్యం కాదు. అలవాటు పడిన ప్రాణం ఊరికే ఉండదు.అందుకే ఎమ్మెల్యేలు చేసిన తప్పులను ఒక్కొక్కటిగా నాయకత్వం లెక్క పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు.పార్టీ నుంచి సస్పెండ్ చేసుకుంటూ పోతే చాలా మందిని చేయాల్సి వస్తుంది.అందుకే వార్నింగ్‌లతో సరిపెడుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్నఎమ్మె ల్యేల్లో చాలా మందికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు సీనియర్ నేతలను నిర్ధాక్షిణ్యంగా పక్కన పెట్టారు. ఈసారి ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంటున్న వారికి మాత్రం నో టిక్కెట్ అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. కార్యకర్తల అభిప్రాయం కూడా ఇలాగే ఉండటంతో నాలుగేళ్లు వీరు ఏం చేసినా వార్నింగ్ లతో సరిపెట్టాల్సిందే. అంతే తప్ప చర్యలుండవు. అసలు చర్యలు ఎన్నికల్లోనే.

## పార్థివ దేహానికి నివాళు లర్పించిన కాంగ్రెస్ నాయకులు

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు జంగేటి రాములు పార్థివదేహాన్ని నివాళులర్పించారు. ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో ఐకెపి బుక్ కీపర్ జంగిటి తిరుపతి వాళ్ల తండ్రి,కాంగ్రెస్ నాయకులు మాజీ వార్డు సభ్యులు జంగిటి రాములు మృతి చెందగా వారి పార్థివదేహానికి ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ,కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్యలు పూలమాల వేసి ఘన నివాళులుఅర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలపడంజరిగింది.ఈ కార్యక్రమంలో వారి వెంట పోతారం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్ర మల్లయ్య,మాజీ ఎంపీటీసీలు బండ సమ్మయ్య,నెత్తెట్ల భారత లక్ష్మి కొమురయ్య,కాంగ్రెస్ నాయకులు చెల్కల ఓదెలు,కోటగిరి శ్రీశైలం,నర్ర రాజేష్,చెల్కల నరేందర్,కిషన్,నెత్తెట్ల శ్రావణ్,రమేష్,ఇట్టం గట్టయ్య, బత్తుల మల్లయ్య తదితర కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు



## పూరీ క్షేత్రం పేరిట నకిలీ వెబ్‌సైట్ దోపిడీ!



విశ్వంభర, పూరీ: ఒడిశాలోని ప్రముఖ పూరీ జగన్నాథ ఆలయంలో ఆన్‌లైన్ పూజల పేరిట భక్తులను మోసం చేస్తున్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను పోలీసులు గుర్తించారు. శ్రీక్షేత్రంలో ప్రత్యేక పూజలు, దర్శనం, నైవేద్య సమర్పణ తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలతో ఆ వెబ్‌సైట్ రూ.వేలల్లో దోపిడికి పాల్పడుతోందని పూరీ ఎస్పీ ప్రతీక్ సింగ్ తెలిపారు. ఈ వ్యవహారం గుట్టు రట్టు కావడంతో.. సైబర్ బృందాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ఆ వెబ్‌సైట్‌నుబ్లాక్ చేసి, కేసుదర్యాప్తునకు చర్యలుతీసుకుంటున్నట్లు చెప్పారు.“జగన్నాథుని దర్శనం, ప్రత్యేక పూజలు తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలు ఇచ్చే నకిలీ వెబ్‌సైట్‌లకు భక్తులు దూరంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. ఆలయ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే ఛానెళ్ల ద్వారా సేవలను ధ్రువీకరించుకోవాలి. అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో హోటళ్లను బుక్ చేసుకునే సమయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం.




## పేరుకుపోతున్న డిఏ బకాయిలు

## ఉద్యోగుల్లో ఆందోళన!

**అమరావతి,తెలంగాణ దిశ :**ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన డిఏ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇప్పటివరకు మూడు డిఏలు పెండింగ్లో ఉండగా, నాలుగో డిఏ కూడా కొద్ది రోజుల్లో జత కాబోతోంది. దీనితో కలిపితే వది నుండి 12 వేల కోట్ల రూపాయలు ఉద్యోగులకు చెల్లించాల్సిఉంటుందని ఆర్థికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడం పట్ల ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బకాలు కోసం ఎన్నిసార్లు వినతులు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో 2.73 శాతంగా ఉన్న డిఏ 2023 జూలై నాటికి 33.67 శాతానికి చేరుకుంది. అయితే అప్పటి నుంచి డిఏ విడుదల కావడం లేదు. అనేక సార్లు ఉద్యోగులతో ఆర్థికశాఖ సమావేశాలు నిర్వహిం చడం, మధ్యలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ భేటీలు జరగడం, వాటిల్లో ఉద్యోగులు తమ డిమాండ్లను వెల్లడించడం మాత్రమే కనిపించింది తప్ప పరిష్కారం మాత్రం కనిపించలేదు. రెండు రోజుల క్రితం జరిగిన జెఎన్ సి సమావేశంలో ఇదే అంశంపై చర్చ జరిగింది. ఆ మరుసటి రోజు జరిగిన మంత్రివర్గ భేటీలో డిఏల ప్రకటన ఉంటుందని ఆశగా ఎదురుచూసినప్పటికీ నిరాశ తప్పలేదు. ఇదే సమయం పిఆర్ సి కమిషన్ నియామకం జరిగినప్పటికీ, ఎప్పుడు చర్చలు ఉంటాయి. ఎప్పుడు నివేదిక ఉంటుంది. ఎప్పుడు అమలులోకి వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఉద్యోగులు వాపోతున్నారు.

# బదిలీల్లో కులం రంగులు..?

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :**శ్రీకాకుళం జిల్లాలో వివాదాస్పదమైన ఓ కేజీబీవీ ప్రిన్సిపాల్ బదిలీ కొత్త మలుపు తిరిగింది. జిల్లాలో ఎప్పటి నుంచి నలుగుతున్న కళింగ వర్సెస్ వెలమ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ బదిలీ వ్యవహారంపై స్పందించిన దువ్వాడ శ్రీనివాస్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. కళింగ నాయకులను తొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం ప్రశాంతతకు మారు పేరు. అక్కడ రాజకీయం కూడా అంతే కూల్‌గా ఉంటుంది. వివాదాలు పెద్దగా ఉండవు. కానీ ఈ మధ్య కాలంలో అమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. లోలుగు కేజీబీవీలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ బదిలీ ఆయన మెడకు చుట్టుకుంది. ఆమెను కంచిలి కేజీబీవీకి బదిలీ చేయడంతో వివాదం రాజుకుంది. తనపై కక్ష పూరితంగా ఎమ్మెల్యే సిఫార్సుతోనే తనను బదిలీ చేశారని ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపించారు. అంతే కాకుండా ఆమె ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. సౌమ్య ఆత్మహత్యాయత్నంతో వివాదం రాజకీయ రంగు పులుముకుంది. వైసీపీ దీన్ని తమకు అనుకూలంగా మార్చుకొని కూన రవికుమార్‌ను టార్గెట్ చేసింది. అధికారంలో ఉన్నామనే అహంకారంతో విచ్చలవిడిగా ఉద్యోగులపై కక్షసాధింపులకు దిగుతున్నారని వైసీపీ అనుకూల మీడియా స్టోరీలు ప్రచురించింది. ఇప్పటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా లేని ధర్మాన కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారు.కట్ చేస్తే సీన్‌లోకి వైసీపీ బహిష్కృత నేత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వచ్చారు. కూన రవికుమార్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని అలాంటి బదిలీల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉండే ఎవరైనా ఉద్యోగాల్లో చేరుతారని చెప్పుకొచ్చారు. కానీ సౌమ్య విషయంలో రాద్ధాంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని చెప్పుకొచ్చారు.అటు కింజరాపు, ఇటు ధర్మాన ఫ్యామిలీపై దువ్వాడ శ్రీనివాస్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.”జిల్లాలో వారం రోజులుగా ఒక ట్రాన్స్‌ఫర్ చర్చనీయాంశంగా మారింది. ఒక ట్రాన్స్‌ఫర్ కోసం ఇంత రచ్చ జరగడం ఎప్పుడూ చూడలేదు. కలెక్టర్ చేసిన ట్రాన్స్‌ఫర్‌పై ఎందుకు రచ్చ జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ సహజమే కదా. మరి ఇది ఎందుకు పొలిటికల్ వార్‌లా మారింది. కులాల ప్రస్తావన ఎందుకు వచ్చింది. దాడులు ఎందుకు జరుగుతున్నాయి? తటస్థ ఎమ్మెల్సీగా పరిశీలిస్తే చాలా విషయాలు వెలుగు చూశాయి. జిల్లావ్యాప్తంగా ఒక కులంపై దాడులు జరుగుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉంది. అటెండర్ నుంచి ఆర్టీవో వరకు ఒక కులం వాళ్లే ఉన్నారు. అది మంత్రి కులానికి చెందిన వారు. మిగతా కులాలపై వేధింపులు సర్వసాధారణమైపోయాయి. నియంత్రుత్వపాలన సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. “ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళింగ కులానికి చెందిన నాయకులు ఎదుగుదల చూడలే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు దువ్వాడ శ్రీనివాస్. మంత్రి అచ్చెన్న చెప్పిన వెంటనే కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారని ఆరోపించారు. అచెన్న బాధితుడైన అధికారిని మాత్రం ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నిం చారు. ఆయన ఏమన్నారంటే” మంత్రి అచ్చెన్న నిర్వాకం అందరికీ తెలిసిందే. వ్యవసాయ పనిముట్లు ఇచ్చే కంపెనీలతో డైరెక్ట్ మీటింగ్ పెట్టమని పేషీలో ఉన్న రాజమోహన్‌పై ఒత్తిడి తెచ్చారు. అది ఆయన చేయలేక ఒత్తిడి భరించలేక లెటర్ సెలవుపై వెళ్లిపోయారు. దీనిపై కృష్ణదాస్ ఏం చేస్తున్నారు. ఆయన్ని ఎందుకు పరామర్శించలేదు. అచ్చెన్న చెప్పాడని సౌమ్యను పరామర్శించారు. రాజమోహన్ అనుభవించింది మానసిక ఒత్తిడి కాదా... మంత్రి అచ్చెన్నపై విమర్శలు చేయరా. ఎందుకు ఒకే కులాన్ని టార్గెట్ చేస్తున్నారు.” కులాన్ని టార్గెట్ చేస్తున్నారని తమ బుర్రల్లోకి వెళ్తే మాత్రం గేమ్ స్టార్ట్ చేస్తామని ధర్మాన, అచ్చెన్నకు వార్నింగ్ ఇచ్చారు దువ్వాడ. “ఎవడిపై రౌడీయిజం చేయాలని అనుకుంటున్నారు. ఇదే జరిగితే అది మా బుర్రల్లోకి ఎక్కింది అంటే మాత్రం కచ్చితంగా ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, అచ్చెన్నకు వార్నింగ్ ఇస్తున్నాను. మేం గేమ్ స్టార్ట్ చేస్తాం. మరో ఉద్యమం ప్రారంభమవుతుంది. జాతికి నష్టం జరుగుతుంటే కచ్చితంగా నేను నిలబడతాను. ఆ జాతితోపాటు మిగతా కులాలను అన్నింటినీ ఏకం చేస్తాం. ప్రాణత్యాగాలు చేయడానికైనా సిద్ధం. కొందరు చీడపురుగులను వాడుకొని కులంలో చిచ్చు రేపాలని చూస్తారు. వారిని కూడా టార్గెట్ చేస్తాం. కళింగ జాగృతి కోసం ముందడుగు వేస్తాం. కళింగ కులస్తుడిని కాబట్టే వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు దువ్వాడ. తాను ఉన్నన్ని రోజులు వారికి మునుగడ ఉండదనే ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అయినా తాను వెనక్కి తగ్గబోనని అన్నారు. “నేను కళింగ కులానికి చెందిన వాడినని సస్పెండ్ చేశారు. స్పీడ్‌గా ఉంటానని సస్పెండ్ చేశారు. నేను ఉంటే వారి ఉనికి ఉండదని సస్పెండ్ చేశారు. నన్ను ఎదుర్కొని దమ్ము లేక సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేస్తే హైదరాబాద్ వెళ్లి బట్టలు మడత పెట్టుకుంటానని అనుకున్నారు. కానీ రాజకీయాలలో మడతేయడానికి వచ్చాను. కులాన్ని వాడుకోవాలనుకుంటే ఎప్పుడో వాడుకునే వాడిని. ఇప్పుడు మాత్రం అన్ని కులాలను వాడుకుంటాను. అన్ని కులాలకు నాయకత్వం వహిస్తాను. కళింగ కులానికి అన్యాయం జరగడంతో ఇతర కులాలు కూడా నష్టపోతున్నాయి. అన్ని కులాలకు బాసటా ఉంటూ ముందు ఉండి నడిపిస్తాం. “ అని అన్నారు.

# పాటల పల్లకిల.. పల్లె తల్లి



నాన్న యక్షగానం చేస్తుంటే ఆ పాటలను కైకట్టి నేర్చుకుంది. చదువుకోకున్నా జానపద సాహిత్యాన్ని సోపతి చేసుకుంది. చేను చెలకల సాక్షిగా బాణీ కట్టుకున్న తన పాటలను ఈ ప్రపంచానికి పరిచయం చేసేందుకు కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టింది చుంచు నాగవ్వ. 'తిరుపతి రెడ్డి' అంటూ తన స్వరాన్ని పరిచయం చేసి, 'మోహన లాలి' పాటను మారుమోగించింది. ప్రస్తుతం మంగ్లీతో జతకట్టి పాడిన 'బాయిలోనే బల్లి పలికే' పాట యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్నది. జానపద కళాకారిణిగా తెలంగాణ భాష, సంస్కృతులను తన పాటల్లో పదిలం చేస్తున్న నాగవ్వను జిందగీ పలకరించింది. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

నాది పెద్దబాల శిక్ష చదువు. మా బాపు యక్షగానం వింటూ పెరిగిన. జగిత్యాల జిల్లా అంబారిపేట మా ఊరు. ఆ చుట్టుపక్కల ఊళ్లందరికీ మా బాపు తెలుసు. ఆయన తీర్పులు చెప్పుట్ల నేర్పరి. ఊళ్ల పంచాయితీ అయితే బాపును పిలిచేటోళ్లు. ఆయన ఫైసలా చేస్తే వంక పెట్టేటో ళ్లు ఉండకపోయేది. న్యాయం అంటే న్యాయమే అనేటోడు. ఇక బాపు పాడుతుంటే అందరూ చెవులు నిక్కబెట్టి వినేటోళ్లు.. ఆయన గాత్రం అమృతమే! ఆయన పాటలు ఎప్పటికీ యాదికుండేలా వాటిని తిరిగి పాడుకునేటోళ్లం. అట్ల చిన్నప్పటి నుంచి పాటమ్మను సోపతి చేసుకు న్నా. ఇంటికాడి అరుగుమీద కూసున్నప్పుడు ఉప్పసోలే.. చేనుకాడ పనిచేసేటప్పుడు అలసట రాకుండా పాటలు పాడుకునేదాన్ని. బతుకమ్మ పాటలు, జానపదాలు, కాముని పాటలు కైగట్టి పాడేదాన్ని. లగ్గం చేసుకొని అత్తగారిల్లు గుల్లకోటకు అచ్చినాంక కూడా పాటను ఇడ్సిపెట్టలే! మా ఇంటాయాన కూడా భజన పాటలు పాడతడు. నేను పాట పాడినప్పుడల్లా 'నీ గొంతు మంచిగుందే' అంటడు.

**సింగిల్ టేక్‌లోనే పాడిన:** నేను పాటలు మంచిగ పాడుతునని మా ఊరోళ్లు, ఇంట్లోళ్లు బాగ మెచ్చుకునేది. మొదట్లో నా పాటలు జనాల్లోకి రావాలనే ఆలోచన లేకుండె. నా కొడుకులిద్దరు కలిసి 'సీఎంఎస్ చానెల్' పెట్టి జానపదాలు మంచిగ పాడేటోళ్లతోని పాటలు పాడిస్తుండ్రి. మొదట్లో నా పాటలను కూడా వాళ్లతోనే పాడించేది. అనుకోకుండా ఒకరోజు నాకు కూడా పాడే అవకాశమిచ్చిన్రు. నా తొలి పాట 'తిరుపతి రెడ్డి'తో ప్రేక్షకుల ముందుకొచ్చినా. నా గొంతును చాలామంది ఆదరించిన్రు. మైక్ పట్టుకోవడం కూడా రాని నేను ఆ పాటను ఒక్కసారికే పాడిన. ఆ తర్వాతకి 'మోహనలాలి' పాటతో జనాలకు మరింత దగ్గరైన. ఇక ఎనుకకు తిరిగి చూస్కోలె. ఇప్పటిదాంక ఇరవై పాటలు పాడుంట. నేను పాడిన పాటలకు బాణీ నాదే!

**ఆ షోతో సినిమా అవకాశం:** స్టూడియోకు పొయ్యి పాటలు పాడుతున్నప్పుడే.. నా కుటుంబ సభ్యుల సహకారంతో ఇతర అవకాశాల కోసం ప్రయత్నించిన. ఆ సమయంలోనే వనిత టీవీలో 'సారంగ దరియా షో' సెలెక్షన్లు జరుగుతున్నయని ఎరుకైంది. నా చిన్నకొడుకు తిరుపతి నా పాటను రికార్డుచేసి పంపిండు. అందులో సెలెక్ట్ అయిన. మూడు ఎపిసోడ్లలో పాల్గొన్న. ఆ తరువాత ఎలిమినేట్ అయినా కూడా న్యాయనిర్ణేతలుగా ఉన్న సినిమా పాటలు రాసే కాసర్లశ్యామ్, సంగీతం చేసే భీమ్స్ నా గొంతు బాగుందని మెచ్చుకున్నరు. అవకాశాలు ఉంటే చెబుతామన్నరు. అన్న మాట నిలబెట్టుకున్నరు. వెంకటేశ్, సల్మాన్‌ఖాన్ నటించిన హిందీ సిన్మా 'కిసీకా భాయ్ కిసీ కీ జాన్'లోని బతుకమ్మ పాటను భీమ్స్ నాతో పాడించిండు. కాసర్ల శ్యామ్ జానపద గాయని మంగ్లీని పరిచయం చేసిండు. మంగ్లీతో దోస్తీ అయినాంక నా పాట 'కొప్పులోని పువ్వమ్మ..బాయికాడి బతుకమ్మ' విడుదలైంది. అది లక్షల మందిని చేరుకుంది.

**ఇన్నాళ్లకు కుదిరింది..:** ఈ మధ్య విడుదల చేసిన 'బాయిలోనే బల్లి పలికే' పాట మస్తు హిట్టయ్యింది. రెండున్నరేళ్లనుంచి పాడాలని అనుకున్న పాటకు గిప్పుడు మోక్షం వచ్చిందన్నట్టు. మంగ్లీతోని కలిసి పాడిన. ఆమెతో కలిసి పాడాలనే ఇన్నాళ్లు ఆగిన. ఆ పాట ప్రోమో విడుదలైన సంది మా చుట్టు పక్కల ఊళ్లల్లో ఉండే ట్రాక్టర్లలో, ఆటోల్లో అదే పాట ఇనవడ్తుంది. నా పాట నేనే వింటుంటే మస్తు సంతోషమైతున్నది. నా కొడుకులొచ్చి ఇప్పటివరకు నేను పాడిన పాటను లక్షమందికిపైగా విన్నరని చెప్పినప్పుడు కండ్లల్ల నీళ్లాగలే! నాకు పాట అలవాటు చేసిన మా బాపు యాదికొచ్చిండు. నా చిన్నకొడుకు తిరుపతి పట్నంల ఉంటడు. మంచి అవకాశాలొచ్చినప్పుడు నన్ను పట్నం తీస్కవోతడు. నా పాటను ఈ తరానికి తగ్గట్టుగా కొత్తగ తయారు చేస్తడు. నా కుటుంబం దన్నుగ నిలవడంతోనే.. నా పాటలు జీవం పోసుకుంటున్నయి.

**ఊరంటే ప్రేమతోనే:** నా మొదటి పాట రికార్డ్ అయి జనాల్లోకి పోయినాంక.. చాలా చాన్స్‌లు వచ్చినట్టే వచ్చి పోయినయి. రాత్రి ఫోన్ చేసి 'రేపు ఉదయమే హైదరాబాద్‌కు రమ్మని' చెప్పేటోళ్లు. నాకు ఊకె పట్నం పోవుడు కష్టమనిపిస్తుండె. అవకాశాల కోసం ఊరినిడిచిపెట్టి పట్నం పోవడం ఇష్టం లేకనే గ్రామంలోనే ఉంటున్న. ఇప్పటికే సినిమాలను జనపదాలు ఏలుతున్నయి. మంచి సినిమాల్లో అవకాశాలు వస్తే కచ్చితంగా నా పాటలకు ప్రాణం పోస్తా.



## విద్యా భారతి పాఠశాలకు జాతీయస్థాయి అవార్డు

తాండూరు మండలం విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. భారతదేశపు ప్రీమియం విద్యా పత్రిక అయిన ఎడ్యుకేషన్ టుడే వారు నిర్వహించిన సర్వేలో ఎడిట్ అవార్డుల ద్వారా దేశవ్యాప్తంగా అత్యుత్తమ పాఠశాలలను గుర్తించి వాటిలో విద్యా భారతి పాఠశాలను మొదటి స్థానంలో ఎంపిక చేయడం జరిగింది .ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురభి ఆగమ రావు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతమైన తాండూర్ మండల కేంద్రంలో విద్యా భారతి పాఠశాలను ప్రారంభించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో తమ పాఠశాలకు ఈ అవార్డు రావడం ఎంతో అభినందనీయమన్నారు .ఆంగ్ల విద్యా వ్యవస్థను ప్రారంభించి విద్యలో శ్రేష్టత కొత్త ప్రమాణాలను నెలకొల్పడం కోసం ఎన్నో మైలురాళ్లను అధిగమించి అందరి ప్రోత్సాహంతో పాఠశాలను ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు .డిజిటల్ లెర్నింగ్ అడ్వాన్స్ మెంట్ కేటగిరి సీబీఎస్ఈ పారామీటర్ ర్యాంకింగ్ కింద విద్యా భారతి పాఠశాలను ఎంపిక చేయడంతో పాటు జాతీయస్థాయిలో అవార్డు రావడం ఎంతో గర్వకారణం అన్నారు .ప్రతి ఒక్క విద్యార్థికి తాము నాణ్యమైన విద్యా బోధన అందించడమే తమ పాఠశాల యొక్క ప్రత్యేకత అన్నారు బెంగళూరులోని ది తాజ్ యశ్వంతపూర్ లో పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ సౌమ్య దంపతులు ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు విద్యార్థుల కృషి ఉపాధ్యాయుల అంకితభావం ప్రతి ఒక్కరి ఆశీస్సులతో ఈ అవార్డును అందుకోవడం జరిగిందని ప్రతి ఒక్కరికి పాఠశాల యాజమాన్యం తరఫున కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందన్నారు.

## ఉత్సాహాన్నిచ్చే హార్మోన్ ఫుడ్



మనం ఏం చేశాం, ఏం చేయలేదు అన్నదానితో సంబంధం లేకుండా ఊరికే కొందరు అలసటకు గురవుతుంటారు. మధ్యాహ్నంలోపే సత్తువ లేనట్టు అయిపోతుంటారు. ఇది హార్మోన్ల అసమతుల్యతకు సంకేతం అంటున్నారు ఆరోగ్యనిపుణులు. వీటిని బ్యాలెన్స్ చేసుకునేందుకు మందులతో అవసరం లేకుండా కొన్ని ఆహార చిట్కాలనూ సూచిస్తున్నారు. సరిపడా నీళ్లు తాగడం వల్ల మెదడు త్వరగా అలసిపోదు. అలాగే నీళ్లలో పుదీన, నిమ్మరసం, బెర్రీల్లాంటి ఇతర పండ్లను చేర్చడం ద్వారా హార్మోన్ల పనితీరూ మెరుగవుతుంది. గ్రీక్ యోగర్ట్, పప్పు దినుసులు, టోఫు, గుడ్డులాంటివి ఒత్తిడిని కలిగించే హార్మోన్ అయిన కార్టిసోల్ స్థాయులను తగ్గిస్తాయి. అంతేకాదు, వీటిలో ఉండే ప్రొటీన్ రోజంతా ఉత్సాహంగా పనిచేయడానికి ఉపకరిస్తుంది. మంచి జీర్ణవ్యవస్థ మన హార్మోన్ల స్థాయిని సమతులంగా ఉంచేందుకు సాయపడుతుంది. అందుకోసం పీచు పదార్థాలు బాగా తినాలి. పీచులు ఉండే బీర, సొర, చిక్కుడులాంటి కూరగాయలు, తృణ ధాన్యాలు, చియా గింజల్లాంటివి ఇందుకోసం తీసుకోవాలి. శరీరంలో మెగ్నీషియం పుష్కలంగా ఉంటే తక్కువగా అలసటకు గురవుతారు. డార్క్ చాకొలెట్, పాలకూర లాంటి వాటిల్లో ఇది పుష్కలంగా దొరుకుతుంది. మెగ్నీషియం స్ట్రెస్ హార్మోన్లను నియంత్రణలో ఉంచేందుకు, కండరాలు త్వరగా కోలుకునేందుకు సాయపడుతుంది. నెమ్మదిగా జీర్ణమయ్యే కార్బోహైడ్రేట్లు కూడా హార్మోన్ల అసమతుల్యతను పోగొట్టేందుకు పనిచేస్తాయి. అందుకోసం క్వినోవా, చిలగడదుంప, ఓట్స్‌లాంటివి తింటే సరి.

## మితమే హితం..



చలికాలంలో చాలామంది వేడినీళ్లను తాగుతుంటారు. జలుబు లక్షణాలతోపాటు గొంతు, ముక్కు, ఛాతీలోని శ్లేష్మాన్ని తగ్గించడంలో వేడినీళ్లు సమర్థంగా పనిచేస్తాయి. శరీరానికి వెచ్చదనం, విశ్రాంతి కూడా లభిస్తుంది. అయితే, రోజంతా వేడినీళ్లు తాగితే.. ఆరోగ్యానికి కీడు జరిగే అవకాశమే అధికమట. ఎక్కువ వేడిగా ఉండే నీటిని తాగడం వల్ల నోటిలోని కణజాలం, అన్నవాహిక దెబ్బతినే ప్రమాదం ఉన్నదని.. యురోపియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాసూటికల్ అండ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం వెల్లడించింది.

శరీర ఉష్ణోగ్రత కంటే నీటి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటే.. మరిన్ని సమస్యలు వస్తాయని హెచ్చరించింది. వేడినీటిని ఎక్కువగా తీసుకుంటే.. కడుపులోని ఆమ్లాల సమతుల్యత దెబ్బతింటుందట. దాంతో అసిడిటీ, గుండెలో మంట, అజీర్ణం లాంటి సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడినీళ్లు త్వరితగతిన చమట, మూత్రంగా మారుతాయి.

వెంటనే బయటికి వచ్చేస్తాయి. దాంతో, శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా, అధిక వ్యాయామం చేసేవారికి తీవ్రమైన సమస్యగా మారుతుంది. ఇక వేడినీటితో

దాహం తగ్గి తక్కువ నీళ్లు తాగుతారు. అదికూడా ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రెగ్యులర్‌గా వేడినీళ్లు తాగితే దంత సమస్యలూ వస్తాయి. టేస్ట్ బడ్స్ దెబ్బతిని, కాసేపటి వరకు ఏది తిన్నా రుచి తెలియకుండా పోతుంది. అందుకే, గోరువెచ్చని నీటిని మితంగా తాగడమే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## కసరత్తులకు.. కాలుష్య కాటు




అధిక కాలుష్యం.. వ్యాయామ ప్రయోజనాలను దెబ్బతీస్తుందట. నిత్యం శారీరక శ్రమ చేసినా.. దీర్ఘకాలికంగా కాలుష్యానికి గురికావడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదట. ఈ విషయాన్ని యూనివర్సిటీ కాలేజ్ లండన్ పరిశోధకులు వెల్లడిస్తున్నారు. యూకే, తైవాన్, చైనా, డెన్మార్క్‌తోపాటు అమెరికా వంటి దేశాలలో వీరు ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందులో భాగంగా దశాబ్దానికి పైగా ట్రాక్ చేసిన సుమారు 15 లక్షల మంది డేటాను విశ్లేషించారు. ఈ సందర్భంగా అందించిన నివేదికలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అధిక కాలుష్య ప్రాంతాలలో నివసించేవారికి, క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం వల్ల కలిగే రక్షణ ప్రభావాలు తగ్గినట్లు వెల్లడించారు. వారానికి కనీసం రెండున్నర గంటలు వ్యాయామం చేసే వ్యక్తులు.. ఏదైనా ఆరోగ్య సమస్యతో మరణించే ప్రమాదం 30 శాతం తక్కువగా ఉందని కనుగొన్నారు. అయితే, ఈ కేటగిరీలోని వ్యక్తులు.. అధిక కాలుష్యం ఉన్న ప్రాంతంలో నివసిస్తుంటే మాత్రం.. వారు చనిపోయే ప్రమాదం 40 నుంచి 45 శాతానికి పెరిగినట్లు వెల్లడించారు. ఇక అధ్యయనంలో భాగంగా గాలిలో సూక్ష్మకణ పదార్థాల స్థాయులనూ పరిశీలించారు. 2.5 మైక్రోమీటర్ల కంటే తక్కువ వ్యాసం కలిగిన 'పీఎం 2.5ఎస్' అని పిలిచే చిన్న కణాలు ఆరోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తున్నాయని గుర్తించారు. అతి సూక్ష్మమైన ఈ కణాలు ఊపిరితిత్తులలో చిక్కుకుని.. రక్తప్రవాహంలోకి ప్రవేశిస్తాయట. ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తాయట. ప్రపంచ జనాభాలో దాదాపు సగం (46 శాతం) మంది.. ఈ సూక్ష్మ కణాల ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు వెల్లడించారు. ఇక కలుషిత వాతావరణంలో చేసే వ్యాయామం.. పూర్తిస్థాయి ప్రయోజనం అందించదని అంటున్నారు.

గాలి నాణ్యతను మెరుగుపరిస్తేనే.. ఆరోగ్య ప్రయోజనాలు పెరుగుతాయని చెబుతున్నారు. ముఖ్యంగా, చలికాలంలో ఉదయపు వ్యాయామం పెద్దవాళ్లకు ఏమాత్రం మంచిదికాదని హెచ్చరిస్తున్నారు. గాలి నాణ్యతను తనిఖీ చేయడం, పరిశుభ్రమైన మార్గాలను ఎంచుకోవడం, కాలుష్యం ఎక్కువగా ఉండే రోజుల్లో వ్యాయామానికి విరమణ ఇవ్వడం.. ఆరోగ్య ప్రయోజనాలను మెరుగుపరుస్తాయని చెబుతున్నారు. ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి స్వచ్ఛమైన గాలి, శారీరక శ్రమ రెండూ ముఖ్యమైనవేనని అంటున్నారు.

## శ్రీ తేజకు అల్లు ఏం చేశాడో తెలుసా

హైదరాబాద్: అదో యాక్సిడెంట్.. కావాలని చేసింది కాదు.. జరిగిన ఘోరానికి ఆయన అసలు బాధ్యుడు కాదు.. అయినా ఆయన్నే టార్గెట్ చేశారు. ప్రాణం పోయిందని.. ఒక ప్రాణం ఊపిరిపై ఉందని ఆడిపోసుకున్నారు.. అయినా ఆ హీరో పడ్డాడు. ఆ కుటుంబానికి జీవితంలో చూడనంత , అందుకోలేనంత సాయం చేశాడు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇ శ్రీతేజ్ ను బతికించాడు. అయినా ఇప్పటికీ ఆ అపనిందలు అల్లు అర్జున్ మోస్తూనే ఉన్నాడు. శ్రీతేజ్ కుటుంబానికి ఎంతో చేసినా చెప్పుకోలేని స్థితిలో బన్నీ ఉన్నాడు. కానీ కొన్ని వక్రమీడియాలు మాత్రం బన్నీని టార్గెట్ చేసి శ్రీతేజ్ ను పావుగా వాడుతూ ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నాయి. బన్నీ ఆ కుటుంబానికి ఎంత చేశాడన్నది మాత్రం ఎవరూ చెప్పడం లేదు. ఆ నిజాన్ని బయటపెట్టడం లేదు. కొంతకాలంగా సోషల్ మీడియాలో హీరోల మీద, ముఖ్యంగా అల్లు అర్జున్ మీద జరుగుతున్న నిరాధారమైన, ద్వేషపూరిత ప్రచారం చూస్తే చాలా బాధ కలుగుతోంది. ఒక విషయాన్ని గురించి పూర్తి నిజాలు తెలుసుకోకుండా కేవలం హీరోల మధ్య 'ఫ్యాన్ వార్స్' కోసం ఇంత చీప్‌గా, నెగటివ్‌గా ప్రచారం చేయడం వల్ల ఎవరికి ఏమీ ఒరగదు. కనీసం ఇలాంటి సున్నితమైన విషయాల్లోనైనా సంయమనం పాటిద్దాం.ఇప్పుడు అల్లు అర్జున్ ? శ్రీతేజ్ అంశం మరోసారి వార్తల్లో నిలుస్తోంది.. కొందరు కావాలనే అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ అల్లు అర్జున్‌పై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ, నిజంగా అక్కడ ఏం జరిగింది, శ్రీతేజ్ కోసం అల్లు అర్జున్ ఎంత చేశారు అనే వాస్తవాలను ఒకసారి పరిశీలిద్దాంతొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్ చికిత్స కోసం అల్లు అర్జున్ ఇప్పటివరకు దాదాపు ? 3.25 కోట్లు ఖర్చు చేశారు.ఇందులో ? 1.5 కోట్లు శ్రీతేజ్ భవిష్యత్తు కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఉన్నాయి. దీనిపై ఇప్పటివరకు వచ్చిన 17 లక్షల వడ్డీని కూడా బ్యాంక్ శ్రీతేజ్ తండ్రికి అందజేసింది. పెండింగ్‌లో ఉన్న హాస్పిటల్ ఖర్చులు ? 75 లక్షల దాకా అల్లు అర్జున్ స్వయంగా చెల్లించారు. చికిత్స తర్వాత శ్రీతేజ్ కోసం అయ్యే రిహాబిలిటేషన్ ఖర్చు కూడా తామే భరిస్తామని అల్లు అర్జున్ బృందం చెప్పింది. అయితే దీనికి దిల్ రాజు గారు మధ్యవర్తిగా ఉండి, "ఆ బాధ్యత నేను చూసుకుంటాను" అని చెప్పినట్లు తెలుస్తోంది. ఇంత మొత్తం ఖర్చు పెట్టి, ఒక బాధిత కుటుంబానికి అండగా నిలబడి, భవిష్యత్తు కోసం కూడా ఆర్థిక భరోసా కల్పించిన వ్యక్తిని, కేవలం ద్వేషంతో, అభూత కల్పనలతో విమర్శించడం ఎంతవరకు సమంజసం?ఒక వ్యక్తి ఇంత పెద్ద మనసుతో సహాయం చేసిన తరువాత కూడా ఇక వదిలేస్తారా? అని ప్రశ్నించడం చాలా దురదృష్టకరం. అసలు ఆ సహాయం చేయాలనే బాధ్యత లేకపోయినా, మానవత్వంతో ముందుకు వచ్చి ఇంత చేసిన తరువాత కూడా వారిపై విమర్శలు చేయడం, నెగటివ్ ప్రచారం చేయడం దారుణం.ఫ్యాన్ వార్స్ ఎంతవరకైనా పర్వాలేదు.. కానీ మానవత్వం, నిజ జీవితంలో జరిగిన సహాయం వంటి విషయాల్లో కూడా తప్పుడు సమాచారాన్ని షేర్ చేయకుండా ఉండటం ఉత్తమం. హీరోల పట్ల ఉండే ద్వేషాన్ని పక్కన పెట్టి, వాస్తవాలను గ్రహించాలి. ఇటువంటి ప్రచారాలు ఆపేసి, నిజమైన సమాచారాన్ని మాత్రమే పంచుదాం.

## మెదడు కణాలతో కంప్యూటర్లు..
# అభివృద్ధి చేస్తున్న పరిశోధకులు!



న్యూఢిల్లీ: మానవ మెదడు కణాలతో కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను తయారు చేసే రోజులు రాబోతున్నాయి. డీఎన్ఏ, ప్రొటీన్లు లేదా సజీవ టిష్యూ (ప్రయోగశాలలో పెంచిన న్యూరాన్లు) ఈ బయో కంప్యూటర్‌లో కంప్యుటేషనల్ టాస్క్‌ను నిర్వహిస్తాయి. ఈ ప్రక్రియలో న్యూరాన్లను వృద్ధి చేయడం, వాటిని ఆర్గనాయిడ్స్‌గా పిలిచే చిన్న క్లస్టర్లుగా అభివృద్ధి చేయడం, ఆ తర్వాత ఈ క్లస్టర్లను ఎలక్ట్రోడ్స్‌కు అనుసంధానం చేయడం ఉంటాయి. అనంతరం వాటిని చిన్న కంప్యూటర్లుగా వాడుకోవచ్చు. ఆసక్తికరమైన మరో విషయం ఏమిటంటే, ఈ బయోకంప్యూటర్లు సంప్రదాయ కంప్యూటర్ల కన్నా తక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయి. ప్రస్తుతం ఈ బయోకంప్యూటర్లు తేలికపాటి కార్యకలాపాలను మాత్రమే నిర్వహించగలుగుతున్నాయి. 2022లో ఆస్ట్రేలియన్ కంపెనీ కార్టికల్ ల్యాబ్స్ విజయవంతంగా ఆర్టిఫిషియల్ న్యూరాన్ల చేత క్లాసిక్ కంప్యూటర్ గేమ్ పోంగ్‌ను ఆడించింది. మరో ఉదాహరణ, బ్రెయినోవేర్ బయోకంప్యూటింగ్ సిస్టమ్. ఇది సజీవ మెదడు కణాలను కంప్యూటర్‌కు అనుసంధానం చేసింది. ఫలితంగా బేసిక్ స్పీచ్ రికగ్నిషన్‌ను సాధించింది. బ్రెయిలీ అక్షరాలను గుర్తించేందుకు న్యూరాన్లతో కూడిన మానవ మెదడు ఆర్గనాయిడ్స్‌ను విజయవంతంగా ఉపయోగించినట్లు ఆగస్టులో బ్రిస్టల్ విశ్వవిద్యాలయం బృందం ప్రకటించింది. మానవ న్యూరాన్లను వృద్ధి చేయడం, వాటిని బయలాజికల్ ట్రాన్సిస్టర్లతో పోల్చదగిన ఫంక్షనల్ సిస్టమ్స్‌గా మార్చడంపై చాలా అకడమిక్, కమర్షియల్ ల్యాబ్స్ ప్రస్తుతం దృష్టి సారించాయి.

# శివారు ప్రాంతాల్లో కనిపించని హడావిడి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలోని 31 జిల్లాల్లో ఎన్నికల కోలాహలం నెలకొనగా మేడ్చల్ జిల్లాలో మాత్రం రాజకీయ నిశ్శబ్దం ఏర్పడింది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఆశావహులు ఉత్సాహంగా బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, మేడ్చల్ జిల్లా నాయకులు నిరుత్సాహంతో ఉన్నారు. మేడ్చల్ హైదరాబాదు జిల్లాల్లో పంచాయతీలు లేనందున ఎన్నికల సందడి లేదు. ఎన్నికల నియమావళి కూడా అమలులో లేదు. జిల్లాలో గతంలో 61 గ్రామపంచాయతీలు, ఐదు మండలాలు ఉండేవి. వీటన్నింటినీ సమీప మున్సిపాలిటీలలో విలీనం చేశారు. కొత్తగా మూడు మున్సిపాలిటీలు ఏర్పాటు చేశారు. తాజాగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల, ఆనుకుని ఉన్న మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేశారు. దీంతో జిల్లాలోని నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లు, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, దుండిగల్, కొంపల్లి, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘటకేసర్, పోచారం మున్సిపాలిటీలు జిహెచ్ఎంసి లో విలీనమయ్యాయి. కొత్తగా ఏర్పడిన ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలు మాత్రమే మిగిలాయి. రాజకీయ నాయకులుగా ఎదగడానికి వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, పట్టణాలలో కౌన్సిలర్ పదవులు తొలిమెట్టుగా భావిస్తారు. స్థానిక సంస్థల వల్ల అనేకమందికి పదవులు లభిస్తాయి. జి హెచ్ ఎం సి లో మున్సిపాలిటీలు విలీనం వల్ల ఆశావహుల అవకాశాల మీద దెబ్బ పడింది. గతంలో ఒక మునిసిపాలిటీలో 30 వార్డులు ఉండటం వల్ల 30 మందికి పదవులు లభించేవి. అదనంగా కో ఆప్షన్ పదవులు కూడా వచ్చేవి. కానీ గ్రేటర్ హైదరాబాదులో విలీనంతో కేవలం ఇద్దరు ముగ్గురికి మాత్రమే పదవులు వచ్చే అవకాశం ఉంటుంది. కిందిస్థాయి వారికి పదవులు వచ్చే అవకాశం ఉండదు. డబ్బున్న వారికి మాత్రమే పోటీ చేయడానికి అవకాశం దక్కుతుంది. ప్రస్తుత తాజా పరిస్థితుల్లో రాజకీయ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు, జిహెచ్ఎంసిలో మున్సిపాలిటీలు విలీనం ఒకేసారి జరగడంతో రాజకీయ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్ఎంసిలో, మున్సిపాలిటీలలో తమ గ్రామాలను విలీనం చేయకుంటే ప్రస్తుతం తమ గ్రామాలలో కూడా ఎన్నికల సందడి ఉండేదని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పంచాయతీలు, పరిషత్తులు, మున్సిపాలిటీలు రద్దుచేసి తమ అవకాశాలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతాలను జిహెచ్ఎంసిలో విలీనంతో ఒరిగేదేమీ లేదని అంటున్నారు.

# అవినీతి రహిత సమాజమే మనందరి లక్ష్యం : సీపీ సన్ ప్రీత్ సింగ్




**హనుమకొండ చౌరస్తా,తెలంగాణ దిశ :** అవినీతి రహిత సమాజం ఏర్పాటు చేయడం మన అందరి లక్ష్యమని వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని వరంగల్ పోలీస్ కమిషనర్ జండా ఊపి ప్రారంభించారు. హనుమకొండ జూనియర్ కళాశాల నుంచి అశోక సెంటర్ వరకు నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీలో విద్యార్థులతో పాటు, స్వచ్ఛంద సంస్థలకు సభ్యులు, ఏసీబీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని, భవిష్యత్తులో అవినీతి నిర్మూలనలో విద్యార్థి, యువత పాత్ర చాలా కీలకమన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ రాజు, ఇతర ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇల్లు కొంటున్నారా..
## అయితే ఈ విషయాల గురించి తెలుసుకోండి!



### కార్పెట్ ఏరియా, బిల్ట్-అప్ ఏరియా, సూపర్ బిల్ట్-అప్ ఏరియాల గురించి తెలుసా?


**మీరు ఓ ఇల్లు లేదా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనాలని అనుకుంటున్నారా? అయితే మీరు కొంటున్న ప్రాపర్టీ కచ్చితమైన పరిమాణం ఎంత? అన్నది మీకు తప్పక తెలియాలి. అప్పుడే దేనికి చెల్లిస్తున్నాం? అన్నది తెలుస్తుంది. బిల్డర్లు, బ్రోకర్లు ప్రాపర్టీ సైజ్‌ను చెప్పేటప్పుడు కొన్ని రకాల కొలమానాలను వాడుతూ ఉంటారు. అవి ఇంటి కొనుగోలుదారులను ఇట్టే గందరగోళంలో పడేసి, తప్పుడు నిర్ణయాలను తీసుకునేందుకు దారి తీయగలవు. మరి సదరు కొలమానాలు ఏమిటి? వాటి మధ్య ఉన్న తేడాలు ఏంటి? అన్నది తెలుసుకుందాం.**

కార్పెట్ ఏరియా: ఇల్లు లేదా ఫ్లాట్ లోపల మనం వాడుకోవడానికి ఉన్న స్థలమే (స్పేస్ విత్ ఇన్ ది ఇంటీరియర్ వాల్స్) కార్పెట్ ఏరియా కామన్ ఏరియాలు, బాల్కనీలు, టెరస్ లేదా షాఫ్ట్ ఇందులోకి రావు. పడక గదులు, వాష్‌రూంలు, లివింగ్ ఏరియా, వంట గది స్థలాలు ఇందులో ఉంటాయి. సాధారణంగా బిల్ట్-అప్ఏరియాలోకార్పెట్ ఏరియా దాదాపు 70శాతంగా ఉంటుంది. అయితే రియల్ ఎస్టేట్ (రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్) చట్టం 2016 ప్రకారం.. కార్పెట్ ఏరియా ను ప్రాపర్టీలో నికరంగా వినియోగించే స్థలంగా పేర్కొన్నారు. బయటి గోడలు, ఎక్స్‌క్లూజివ్ బాల్కనీ, వరండా, టెరస్ ఇందులోకి రావు. బిల్ట్-అప్ ఏరియా: ఇది ఇల్లు లేదా ఫ్లాట్ మొత్తం ఏరియాను సూచిస్తుంది. కార్పెట్ ఏరియా కూడా ఇందులోనే కలిసి ఉంటుంది. ఇంటి లోపలి, బయటి గోడలు, బాల్కనీ, వరండా, టెరస్‌లూ భాగమే. అందువల్ల బిల్ట్-అప్ ఏరియా.. కార్పెట్ ఏరియా కంటే పెద్దదిగా ఉంటుంది. అందుకే చాలామంది బిల్డర్లు, బ్రోకర్లు తమ ప్రాపర్టీల మార్కెటింగ్ కోసం ఇటీవలికాలంలో ఈ బిల్ట్-అప్ ఏరియానే ఎక్కువగా వాడుతూ ఉన్నారు. సూపర్ బిల్ట్-అప్ ఏరియా: ఇందులో బిల్ట్-అప్ ఏరియా కలిసిపోయి ఉంటుంది. అపార్ట్‌మెంట్ కామన్ ఏరియాలైన లిఫ్ట్ లాబీ, షాఫ్ట్, కారిడార్లు, మెట్లు వంటివన్నింటిలో దామాషా వాటా కూడా కలుస్తుంది. కొందరు డెవలపర్లు స్విమ్మింగ్ పూల్, పార్కులు, క్లబ్‌హౌజ్, పార్కింగ్ స్పేస్ వంటివీ చూపిస్తున్నారు. కొనుగోలుదారులూ పారాహుషార్: నిర్మాణ రంగంలో అనేక మోసాలు జరుగుతున్నాయి. ఆకాశన్నంటుతున్న భూముల ధరలు, మితిమీరిన నిర్మాణ ఖర్చులు వంటివి ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇక కొనుగోలుదారుల అమాయకత్వం కూడా మోసగాళ్లకు వరంగా మారుతున్నది. కాబట్టి ఇంటిని కొనేటప్పుడు అన్నింటినీ క్షుణ్ణంగా గమనించడం ఉత్తమం. స్థల పురాణం, డాక్యుమెంట్లు, అనుమతులతోపాటు నిర్మాణ నాణ్యతనూ పరిశీలించాలి. డబుల్ రిజిస్ట్రేషన్లపైనా ఆరా తీయాలి. నిబంధనల్ని పాటించే నిర్మాణం జరిగిందా? అన్నది చూసుకోవడమేగాక, ఆస్తి విలువ, సదరు ఏరియా, చుట్టుపక్కల ఉన్న సదుపాయాలు, వసతులు, రుణ లభ్యత వంటి వాటిని గమనించి ఓ నిర్ణయం తీసుకుంటే మంచిది. ఫ్లాట్ ఎస్ఎఫ్‌టీ, హౌస్ స్కేర్ యార్డ్స్ అన్నింటినీ సరిచూసుకోవాలి. అవసరమైతే న్యాయ, ఆర్థిక నిపుణుల సలహాలనూ తీసుకోవడం లాభదాయకం.


# రేబిస్ సోకి ఆవు మృతి.. టీకా కోసం క్యూ కట్టిన గ్రామస్తులు



కోల్‌కతా: ఒక వ్యక్తికి చెందిన ఆవు రేబిస్ సోకి మరణించింది. అయితే ఆ ఆవు పాలతో తయారు చేసిన పంచామృతాన్ని పలువురు సేవించారు. ఆ ఆవు పాలను కూడా పలువురు వినియోగించారు. ఆందోళన చెందిన వారంతా టీకా కోసం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద క్యూకట్టారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పాషాంగ్ గ్రామానికి చెందిన హృషికేశ్ మైతి ఇంట్లో ఆవు ఉన్నది. గత గురువారం పౌరి?మ పూజ సందర్భంగా ఆయన ఇంట్లో ఆ ఆవు పాలతో 'పంచామృతం' తయారు చేశారు. స్థానికులకు ఆ ప్రసాదాన్ని పంపిణీ చేయగా వారు స్వీకరించారు. ఆ గ్రామానికి చెందిన పలు కుటుంబాలకూ ఆవు పాలను అతడు అమ్మాడు. కాగా, ఒక రోజు ముందు ఆ ఆవును కుక్క కరిచింది. దీంతో ఆ గురువారం రాత్రి అనారోగ్యంతో అది మరణించింది. రేబిస్ సోకడంతో ఆ ఆవు చనిపోయినట్లు పశువైద్యుడు అనుమానం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఆ ఆవు పాలతో 'పంచామృతం' చేసి సేవించిన హృషికేశ్ కుటుంబం ఆందోళన చెందింది. ఆ కుటుంబంలోని 11 మంది ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి యాంటీ రేబిస్ టీకా పొందారు. మరోవైపు పంచామృతం సేవించిన స్థానికులతోపాటు ఆ ఆవు పాలు వినియోగించిన గ్రామస్తులకు శనివారం ఈ విషయం తెలిసింది. దీంతో వారంతా ఆందోళన చెందారు. పెద్ద సంఖ్యలో స్థానిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. యాంటీ రేబిస్ టీకా కోసం క్యూకట్టారు. అయితే ఆవు పాల ద్వారా రేబిస్ సోకదని డాక్టర్లు, ఆరోగ్య అధికారులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ముందు జాగ్రత్త కోసం తమకు టీకా వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దీంతో సుమారు 222 మందికి తొలి డోసు టీకా వేశారు. గత నెలలో ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్ జిల్లాలోని గ్రామంలో కూడా ఇలాంటి సంఘటన జరిగింది. రేబిస్‌తో ఆవు మరణించడంతో సుమారు 200 మంది గ్రామస్తులు యాంటీ రేబిస్ టీకా పొందారు.



# మధుర కవితా శిఖరం



ఆయన పద్య కవితాధారతో అందరినీ మురిపిస్తారు. మృదుమధురమైన ప్రసంగాలతో మైమరిపిస్తారు. అవధానంతో సభాసదులందరినీ అలరిస్తారు. కమ్మని కవితా కాంతులతో ప్రకాశిస్తారు. మాటల పాటల మాంత్రికుడై పరవశింపజేస్తారు. ఆయన ఎవరో కాదు ప్రముఖ విద్వత్కవి, అవధాన యువకేసరి డాక్టర్ అందె వేంకటరాజం. కవిగా, అష్టావధానిగా సుపరిచితులైన ఆయన జగిత్యాల జిల్లా కోరుట్లలో భూదేవి-లింబయ్య దంపతులకు 1933 అక్టోబర్ 14న జన్మించారు.

జగిత్యాలలో పాఠశాల విద్యనభ్యసించిన వేంకటరాజం కాకతీయ యూనివర్సిటీలో బీవోఎల్,ఎంఏ చదువుకున్నారు. 'వానమామలై వరదాచార్యుల కృతులు-అనుశీలనం' అనే అంశంపై పరిశోధన చేసి కేయూ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఆయన చదివింది ఉర్దూ మీడియం అయినప్పటికీ, తెలుగు భాషపై ఉన్న అభిమానంతో ప్రత్యేకంగా తెలుగు పరీక్షలు రాసి డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకుడిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రకృతిని గాఢంగా పరిశీలించే మనస్తత్వం ఉన్న వేంకటరాజం చిన్నప్పటి నుంచే కవిత్వం రాయడం ప్రారంభించారు. ఈయన అచ్చమైన సంప్రదాయవాది. మృదుమధురమైన పద్య రచన చేయడంలో అందె వేసిన చేయి. అంతేకాకుండా గేయ రచనలోనూ చేయి తిరిగినవారు. వ్యాసాలు, కథలు, నాటికలు, నాటకాలు రాశారు. విశేషించి సుప్రసిద్ధ కవి, అభినవ పోతన డాక్టర్ వానమామలై వరదాచార్యులకు ఆంతరంగిక శిష్యుడు. మహాకవి విశ్వనాథ సత్యనారాయణ, దాశరథి, దివాకర్ల వేంకటవధాని, డాక్టర్ సి.నారాయణరెడ్డి లాంటి మహాకవుల ప్రశంసలు పొందారు. ముఖ్యంగా డాక్టర్ సి.నారాయణరెడ్డి ఈయనతో కొన్ని గంటల తరబడి సాహిత్య చర్చలు చేసేవారంటే, ఈయన పాండిత్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 'భారతీయ సాహిత్య సమితి' అనే సాహితీ సంస్థను నెలకొల్పి ఎన్నెన్నో వినూత్నమైన సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. నవోదయం, మణి మంజూ, మాసవీణ, నింబగిరి నరసింహ శతకం, ఈశ్వర శతకం, మాధవ శర్మ, భువన విజయం, సాహితీ జీవన తరంగాలు, విచిత్ర గాథలు, స్వర్ణ భారతం, భారత రాణి, కళా తపస్విని మొదలైన 25 పుస్తకాలను వేంకటరాజం రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పిలుపునందుకొని వానమామలై వరదాచార్యులపై లఘు గ్రంథాన్ని కూడా రాశారు. నవోదయం కావ్యంలోని 'సెలయేరు' అనే కవిత అప్పట్లో మైసూరు విశ్వవిద్యాలయం విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చారంటే ఆయన ప్రతిభా సంపత్తి గురించి వేరే చెప్పవలసిన పనిలేదు.

వేంకటరాజం చక్కని కావ్యాలు రాయడమే కాదు, అవలీలగా, అద్భుతంగా అష్టావధానాలు కూడా చేశారు. అష్టావధానం చేయడంలో ఈయనది ప్రత్యేకమైన శైలి. పృచ్ఛకులు ఎంత కష్టమైన ప్రశ్నలు వేసినా అత్యంత సులభంగా, అతివేగంగా, పండితులనే కాక సామాన్య శ్రోతల్ని కూడా అలరించే రీతిలో అవధానం చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. వీరు చేసే అవధానాల్లో జీవీ సుబ్రహ్మణ్యం, తిరుమల శ్రీనివాసాచార్య, ఇరివెంటి కృష్ణమూర్తి లాంటి మహానుభావులు పృచ్ఛకులుగా పాల్గొనేవారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాక మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో కూడా అవధానాలు నిర్వహించి 'అవధాన యువకేసరి' బిరుదును కూడా పొందారు. మొత్తం ఎనభై ఎనిమిది అవధానాలు చేసి అవధాన సరస్వతిని అభిషేకించారు. వేంకటరాజం కవిత్వంలోనే కాదు,గృహవాస్తు, జ్యోతిష శాస్త్రాల్లో కూడాచక్కని పరిజ్ఞానం కలిగినవారు. వీరు రాసిన నింబగిరి నరసింహ శతకంలోని పద్యాలు ప్రస్తుతం 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. వీరి షష్టిపూర్తి రోజున మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి ఆయన చేతికి స్వర్ణకంకణాన్నిఅలంకరించడం విశేషం.

గంభీరమైన ప్రౌఢత్వంతో విరాజిల్లే వేంకటరాజం పద్యాలు, లలితమైన శబ్ద సౌందర్యంతో ప్రకాశించే ఆయన కవితలు చాలామంది అభిమానుల నాల్కలపై నాట్యామాడుతుంటాయి. మధురకవి, కవి శిరోమణి, అవధాన యువకేసరి, అవధాన పంచానన వంటి బిరుదులు, తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యత్వం, హైదరాబాద్, బొంబాయి, పునా వంటి ప్రాంతాల్లో అనేక గౌరవ సత్కారాలు, పురస్కారాలు అందుకున్న అందె వేంకటరాజం 2006 సెప్టెంబర్ 11న పరమపదించడం సాహితీ లోకానికి తీరని లోటు.

# ఆన్‌లైన్ ఫుడ్‌కు అలవాటు పడుతున్న యువత..

**- యువతలో వేగంగా మారుతున్న ఆహారపు అలవాట్లు**
**- ఆన్‌లైన్‌లో అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్ ఆర్డర్లకే మొగ్గు**
**- ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అనారోగ్యకర ఆహారానికే ప్రాధాన్యం**
**- భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు తప్పవంటున్న నిపుణులు**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశంలో యువత ఆహారపు అలవాట్లు వేగంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా జెనరేషన్-జెడ్ (జెన్-జెడ్) యువత ఇంటి భోజనానికి దూరమై, ఆన్‌లైన్‌లో లభించే ప్యాకేజ్డ్, అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారని 'లోకల్ సర్కిల్స్' సంస్థ నిర్వహించిన తాజా సర్వేలో వెల్లడైంది. అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు (హెచ్ఎఫ్ఎస్ఎస్) ఉండే ఆహారాన్నే ఎక్కువగా ఆర్డర్ చేస్తున్నట్లు తేలింది. దేశవ్యాప్తంగా 277 జిల్లాల్లో 24 వేల మందిపై ఈ సర్వే నిర్వహించారు. అమెజాన్ ఫ్రెష్, బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్ వంటి ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో విక్రయించే ఆహార పదార్థాల్లో 50 శాతానికి పైగా అల్ట్రా-ప్రాసెస్డ్, జంక్ ఫుడ్‌కు చెందినవే ఉంటున్నాయని సర్వే గుర్తించింది. ముఖ్యంగా బ్లింకిట్ (62 శాతం), జెప్టో (58 శాతం) వంటి యాప్‌లలో వీటి ప్రాబల్యం ఎక్కువగా ఉంది. ఆన్‌లైన్‌లో ఆహారం కొనుగోలు చేసే కుటుంబాల్లో 39 శాతం మంది.. తమ ఇంట్లోని యువతే ఎక్కువగా ఆర్డర్లు పెడుతున్నారని తెలిపారు. కేవలం 10-20 నిమిషాల్లోనే డెలివరీ చేసే క్విక్ కామర్స్ సంస్థల వల్ల ఈ ధోరణి మరింత పెరిగింది. ఈ ఆహారపు అలవాట్ల వల్ల యువతలో ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బుల వంటి జీవనశైలి వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ-కామర్స్ సంస్థల ఆఫర్లు, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఫుడ్ రెగ్యులేటరీ సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్యాకేజ్డ్ ఫుడ్స్‌పై కొవ్వు, చక్కెర, ఉప్పు వివరాలను స్పష్టంగా, పెద్ద అక్షరాలతో ముద్రించాలని, అనారోగ్యకర ఆహార విక్రయాలపై ఆన్‌లైన్ సంస్థలకు కఠిన నిబంధనలు విధించాలని వారు కోరుతున్నారు.

# సినిమా..

## 'వేల్పారి'తో మరో విజువల్ వండర్ .. 1000 కోట్ల ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో భారీ చర్చ



భారీ బడ్జెట్, అత్యాధునిక సాంకేతికత, భారీ విజువల్స్ .. ఈ మూడు పదాలు చెప్పగానే గుర్తుకు వచ్చే పేరు దర్శకుడు శంకర్. 'జెంటిల్‌మన్' నుండి 'రోబో' వరకు భారతీయ సినిమాకు కొత్త దారులు చూపించిన ఈ మెగా డైరెక్టర్ ఈ మధ్య కాలంలో అనుకున్న స్థాయి ఫలితాలు అందుకోకపోవడంతో విమర్శల పాలయ్యారు. '2.0'కి వచ్చిన మిక్స్ రెస్పాన్స్, ఆ తర్వాత 'ఇండియన్ 2', 'గేమ్ ఛేంజర్' డిజాస్టర్ ఫలితాలు శంకర్ ప్రతిష్టను గణనీయంగా దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో ఆయన తీసుకునే ప్రతి నిర?యం నిర్మాతలలో ఆందోళన కలిగిస్తోంది.

తాజాగా జరిగిన ఓ ఈవెంట్‌లో శంకర్ చేసిన కీలక ప్రకటన ఇప్పుడు తమిళ-తెలుగు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ప్రముఖ రచయిత సు.వెంకటేశన్ రాసిన నవల వేల్పారి ఆధారంగా భారీ సినిమా తీయబోతున్నట్లు ఆయన తెలిపారు.

ఏకంగా లక్షకు పైగా కాపీలు అమ్ముడైన చారిత్రక నవల 'వేల్పారి'. దీనిపై సినిమా అంటే అందరిలో ఆసక్తి మరింత పెరిగింది. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్', 'అవతార్' స్థాయి టెక్నాలజీని ఈ సినిమాలో ఉపయోగిస్తాను అని శంకర్ వెల్లడించారు. దీంతో ఈ సినిమా బడ్జెట్ రూ.1000 కోట్లకు పైగానే ఉండే అవకాశం ఉందని కోలీవుడ్ టాక్. శంకర్ భారీ బడ్జెట్, షూటింగ్ ఆలస్యం, ఎక్కువ ఖర్చులు నిర్మాతలకు భయానకంగా మారింది. 'ఇండియన్ 2' ఆలస్యం వల్ల లైకా ప్రొడక్షన్స్ భారీ నష్టాలు వచ్చాయి.

'గేమ్ ఛేంజర్' తో దిల్ రాజుకు భారీ ఒత్తిడి నెలకొంది. ఇలాంటి సమయంలో 1000 కోట్ల చారిత్రక చిత్రం తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు? ఈ స్థాయి సినిమాకు స్టార్ హీరో డేట్స్ ఇస్తారా ? అనే ప్రశ్నలు ఫిల్మ్ సర్కిల్స్‌లో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కాన్సెప్ట్ స్టేజ్ లో ఉందనే సమాచారం. ప్రొడ్యూసర్, స్టార్ కాస్ట్, షూటింగ్ ప్లాన్‌పై ఎలాంటి క్లారిటీ లేదు.

ఒకవేళ ఇది నిజంగానే పట్టాలెక్కితే శంకర్ కెరీర్‌కు తిరుగులేని రీఎంట్రీ కావొచ్చు ఇది కూడా శంకర్ డ్రీమ్ ప్రాజెక్టుల జాబితాలోనే నిలిచిపోవచ్చు. 'రోబో' తర్వాత శంకర్ సినిమాల్లో ప్రేక్షకులు కోరుకున్న మ్యాజిక్, ఎమోషన్, గ్రాండ్ విజన్ కనిపించలేదనేది సినీ విమర్శకుల అభిప్రాయం. ఇప్పుడు 'వేల్పారి'తో ఆయన మళ్లీ తన పాత ఫామ్ అందుకుంటారా లేదా అన్నది చూడాలి.


## 'శశిరేఖ' వచ్చేసింది.. చిరు 'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి సెకండ్ సింగిల్ ప్రోమో రిలీజ్




కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవర ప్రసాద్' చిత్రం నుంచి తాజాగా రెండో పాట విడుదల తేదీ ఖరారైంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'మీసాల పిల్ల' భారీ విజయాన్ని సాధించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తదుపరి పాట అప్‌డేట్‌తో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. . ఈ సందర్భంగా పాటకు సంబంధించిన ప్రోమోను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండగా.. మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ (షైన్ స్క్రీన్స్) సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## సమంత గురించి రాజ్ పిన్ని అలా అనేసింది ఏంటి..





సమంత, రాజ్ నిడిమోరుల వివాహం ఇటీవలే డెస్టినేషన్ స్టైల్‌లో ఘనంగా జరగగా, ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఆసక్తికర విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికే ఫ్యాషన్ డిజైనర్ శిల్పా రెడ్డి ఈ వేడుకలో జరిగిన ప్రత్యేక క్షణాలను పంచుకోగా, తాజాగా రాజ్ నిడిమోరుల పిన్ని శోభారాజు కూడా ఈ వివాహంపై ఎన్నో తెలియని విషయాలు వెల్లడించారు. అన్నమయ్య సంకీర్తనలతో ప్రసిద్ధి చెందిన ఆమె, సామ్‌తో ఉన్న మునుపటి అనుబంధాన్ని, రాజ్ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "రాజ్ మా అక్క కుమారుడు. చిన్నప్పుడే డివోషనల్ పాటలు పాడేవాడు. అతనిపై నాకు అపారమైన ప్రేమ," అని చెప్పిన శోభారాజు, సమంత గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. "ఆహారం విషయంలో సామ్ చాలా క్రమశిక్షణతో ఉంటుంది. మూడు నెలలకోసారి ఈశా యోగా కేంద్రానికి వెళ్లి ధ్యానం చేస్తుందని విన్నాను. తర్వాత నిజమే అని తెలిసింది. ఆమె పక్కన కూర్చోవాలంటే సిగ్గేసేది. ఆమె ఇచ్చే డైట్ సలహాలు పాటించాలంటే భయమేసేది," అని చిరునవ్వుతో గుర్తుచేసుకున్నారు.

సామ్ ఆధ్యాత్మికత, ధ్యానం, ఫిట్‌నెస్ పట్ల ఉన్న నిబద్ధత రాజ్‌కు కూడా ఉందని, ఇద్దరూ ఆహారం, వ్యాయామం, మెడిటేషన్ విషయంలో ఒకే రకమైన క్రమశిక్షణ పాటించడం మంచి విషయం అని తెలిపారు. ఈ పెళ్లిలో పాటించిన ప్రత్యేక ఆచారాల గురించీ శోభారాజు వివరించారు. వివాహ పద్ధతిలో 'క్లేశ నాశన' అనే ఆధ్యాత్మిక రిట్యువల్‌ను చేపట్టారని, పూర్తిగా సాత్వికాహారంతో అతిథులను ఆతిథ్యం పలికారని చెప్పారు. అలాగే అతిథులకు సహజ సిద్ధమైన పర్ఫ్యూమ్స్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారని తెలిపారు. "పెళ్లి దుస్తుల్లో సమంత అసాధారణంగా అందంగా కనిపించింది," అని ఆమె పొగడ్తలు కురిపించారు.వివాహ వేడుకలు ముగియగానే మళ్లీ తమ తమ ప్రొఫెషనల్ కమిట్‌మెంట్లతో బిజీ అయ్యారు సమంత, రాజ్. కాగా, సమంత నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు సామ్ నిర్మాతగా కూడా వ్యవహరిస్తోంది. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఇక రాజ్ నిడిమోరుల విషయానికి వస్తే, అతను తాజగా రూపొందించిన 'ది ఫ్యామిలీమ్యాన్ 3' అమెజాన్ ప్రైమ్‌లో భారీ విజయాన్ని అందుకుంటోంది. ఇటీవల ముంబైలో జరిగిన సక్సెస్ పార్టీకి రాజ్, డీకే, మనోజ్ బాజ్‌పాయ్ తదితరులు హాజరయ్యారు.

## యంగ్ హీరోయిన్ కృతి శెట్టి భయానక అనుభవం..

## "నా రూమ్‌లో ఆత్మ కనిపించింది" అంటూ కామెంట్



యువ కథానాయిక కృతి శెట్టి ఇటీవల ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెన్నులో వణుకు పుట్టించే అనుభవాన్ని పంచుకున్నారు. సినిమా షూటింగ్‌కు ఒక్క రోజు ముందు హోటల్ రూమ్‌లో తనకూ, తన అమ్మకూ ఆత్మలాంటి ఆకారం కనిపించిందని పేర్కొన్నారు. ఈ సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'ఉప్పెన' చిత్రంతో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్న కృతి శెట్టి, తరువాత వరుస సినిమాల్లో నటించినప్పటికీ పెద్ద విజయాలు అందుకోలేకపోయింది. దీంతో తమిళం, మలయాళం రంగాల్లో అవకాశాలపై దృష్టి పెట్టిన ఆమె ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన వా వాతియర్ (తెలుగులో 'అన్నగారు వస్తారు') మూవీ ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ క్రమంలో కృతి మాట్లాడుతూ.. అన్నగారు వస్తారు షూటింగ్‌కు ఒక రోజు ముందు నేను, మా అమ్మ హోటల్‌లో ఉండగా ఆత్మ లాంటి ఆకారం కనిపించిందని చెప్పింది. వెంటనే లైట్ ఆన్ చేయగానే పెద్ద శబ్దంతో ఆ ఆకారం మాయమైందని చెప్పింది. తుళు సంస్కృతికి చెందినవారమైన తమ ఇంట్లో పూర్వీకులను దైవంలా పూజించే సంప్రదాయం ఉందని, ఇలాంటి అతీత శక్తులపై విశ్వాసం ఎప్పటినుంచో ఉందని పేర్కొన్నారు. ఈ సంఘటనతో తన విశ్వాసం మరింత పెరిగిందని చెప్పారు. 'అన్నగారు వస్తారు' సినిమాలో కృతిశెట్టి పాత్ర ఆత్మలతో మాట్లాడే పాత్రగా ఉండటం వల్ల ఆమె ఈ అనుభవాన్ని ప్రమోషన్ కోసమే చెప్పిందా? లేక నిజంగానే ఆత్మను చూసిందా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. త్వరలోనే సినిమా విడుదల కానుండటంతో కృతి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. సినిమా ప్రమోషన్ కోసం సృష్టించిన హైపా,లేక నిజంగా అనుభవించిన ఘటననా? అనేది మాత్రం రాబోయే రోజుల్లో తెలియనుంది. కొన్నాళ్లుగా మంచి హిట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న కృతి శెట్టికి ఈ చిత్రం మంచి విజయం దక్కాలని ఆమె అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## సక్సెస్ లేకపోతే ఎవరైనా 'జీరో'నే: నటి ఇంద్రజ



1990లలో కథానాయికగా వెండితెరపై సందడి చేసిన అందాల తార ఇంద్రజ. హీరోయిన్స్ మధ్య గట్టి పోటీ నడుస్తున్న సమయంలో ఆమె ఎంట్రీ ఇచ్చారు. తనకి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రస్తుతం ఆమె కేరక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేస్తూ బిజీగానే ఉన్నారు. తాజాగా 'బిగ్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. " నాకు ఊహ తెలిసే సమయానికే మా అమ్మ హార్ట్ పేషంట్. ఒకసారి అమ్మకి అత్యవసరంగా సర్జరీ చేయించవలసి వచ్చింది. నా కంటే చిన్నవాళ్లయిన చెల్లెళ్లు ఏమీ చేయలేని పరిస్థితి. అప్పటికి నేను ఒక సినిమాలో చేస్తున్నాను. వాళ్లకి పరిస్థితి చెప్పినా, నాకు ఇవ్వవలసిన డబ్బు కూడా ఇవ్వలేదు. చివరికి మా పరిస్థితికి జాలిపడి ఇద్దరు డాక్టర్లు సర్జరీ పూర్తి చేశారు. ఆ తరువాత నిదానంగా డబ్బు సర్దుబాటు చేశాము. అందువలన నన్ను ఎవరైనా సాయం అడిగితే కాదనలేను" అని అన్నారు. "ఇప్పుడు రోజులు మారిపోయాయి. ఎవరికైతే మంచి జరగాలని కోరుకుంటూ సాయం చేస్తున్నామో .. వాళ్ల నుంచే మనం ఎదురుదెబ్బలు తినవలసి వస్తోంది. ఇలాంటి సంఘటనల వల్లనే మనుషుల మీద మనుషులకు నమ్మకం పోతోంది .. 'మనీ' మీద ఉన్న ప్రేమ అంతకంతకూ పెరిగిపోతోంది. ఎంత గుణవంతులైనా .. ఎంత చదువుకున్నా .. ఎంత ప్రతిభ ఉన్నా డబ్బులేకపోతే 'జీరో'గానే చూస్తారు. ఇప్పుడు ఎవరైనా సరే మనతో కాదు, మన సక్సెస్ తో .. మన స్టేటస్ తో మాత్రమే మాట్లాడుతున్నారు" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## ఇది ధనుష్‌కు మాత్రమే సొంతమైన ఘనత



ఒక స్టార్ హీరో నుంచి ఒకే ఏడాది మూడు సినిమాలు రిలీజ్ కావడమే అరుదైన విషయం. అలాంటిది వేర్వేరు భాషల్లో ఆ మూడు సినిమాలు చేయడం.. ఆ మూడూ ఆయా భాషల్లో విజయవంతం కావడం ఇంకా అరుదైన ఘనతే. తమిళ స్టార్ హీరో ధనుష్‌కు ఈ రికార్డు సొంతమైంది. అతను ఈ ఏడాది జూన్‌లో 'కుబేర' చిత్రంతో పలకరించాడు. 'సార్' తర్వాత అతను చేసిన రెండో తెలుగు చిత్రమిది. శేఖర్ కమ్ముల రూపొందించిన ఈ చిత్రం తెలుగులో మంచి విజయం సాధించింది. తమిళంలో మాత్రం 'కుబేర' సరిగా ఆడలేదు. స్టార్‌పవర్ లేకపోతే అంతేగా! ఆ తర్వాత ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇడ్లీ కడై' సినిమా అక్టోబరు మొదటి వారంలో రిలీజైంది. ఆ చిత్రం తెలుగులో కూడా విడుదలైనప్పటికీ.. ఇక్కడ సరిగా ఆడలేదు. కానీ ధనుష్ సొంత భాష అయిన తమిళంలో పెద్ద హిట్టే అయింది. ఓటీటీలోకి వచ్చాక ఈ సినిమాకు మరింత ఆదరణ దక్కింది. దర్శకుడిగా వరుసగా నాలుగో చిత్రంతోనూ అతను సక్సెస్ అందుకున్నాడు. ఇప్పుడిక 'తేరే ఇష్క్ మే' సినిమాతో ధనుష్ హిందీలో కూడా జయకేతనం ఎగురవేశాడు. తనకు 'రాన్‌జానా' రూపంలో మరపురాని సినిమాను అందించిన ఆనంద్.ఎల్.రాయ్ దర్శకత్వంలో ధనుష్ నటించిన చిత్రమిది. కృతి సనన్ కథానాయిక. ఇంటెన్స్ టీజర్, ట్రైలర్‌లతో ఆకట్టుకున్న 'తేరే ఇష్క్ మే' గత శుక్రవారమే మంచి అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రానికి పాజిటివ్ రివ్యూలు, టాక్ వచ్చాయి. తొలి రోజు ఇండియాలో రూ.15 కోట్ల నెట్ వసూళ్లతో 'తేరే ఇష్క్ మే' మంచి ఓపెనింగ్ వచ్చింది. తర్వాతి రెండు రోజుల్లోనూ ఈ సినిమా కలెక్షన్లు స్టడీగా ఉన్నాయి. ఫస్ట్ వీకెండ్లో ఇండియా వరకే హాఫ్ సెంచరీ కొట్టింది 'తేరే ఇష్క్ మే'. వీకెండ్ తర్వాత కూడా సినిమాకు మంచి రెస్పాన్సే వస్తోంది. ధనుష్‌కు బాలీవుడ్లో మరో హిట్ పడిందన్నది స్పష్టం. ఈ సినిమాలో తన నటనకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. ఇలా ఒకే ఏడాది ఒక హీరో మూడు భాషల్లో హిట్లు కొట్టడం ఒక రికార్డని చెప్పొచ్చు. దీన్ని ఇంకెవ్వరూ బద్దలు కొట్టలేరేమో.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215